



జ్ఞాన యోగం


విచారణ

జన్మరాహిత్య ప్రభోదిని








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2990100061586

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

జన్మరాహిత్య ప్రబోధిని


(ఆధ్యాత్మిక గ్రంథము)

గ్రంథకర్త :

పందిరి శ్రీశైలము B. Sc.

Endowments Executive officer

V. Sreenivasa Gupta,
PHILATELIST & NUMISMATIST
VETAPALEM-523187.
PRAKASAM DT. (A. P)



గ్రంథకర్త

పందిరి శ్రీశైలము, B. Sc.

ఎండోమెంట్సు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు

ఓం

శ్రీ వాసవీకన్యకాదేవ్యైనమః

పునర్జన్మ

1. ప్రాణులకు పునర్జన్మ కలదా ?

హిందూ మతవిశ్వాసము ననుసరించి మానవునకు పునర్జన్మ కలదనుట ధ్రువమైన విషయము. ఈ విషయమును హిందూమతమునకు పరమ ప్రమాణములైన సర్వగ్రంధములు సంపూర్ణముగ సమర్థించుచున్నవి. నిర్భ్రాంతస్వతఃప్రమాణములగు వేదములలో పునర్జన్మను గూర్చి చెప్పబడిన విషయములను మచ్చునకు కొన్నింటిని యిట యిచ్చుచున్నాను. పరికింపుము.

మంత్రము : "అసునీతే పునరస్మాసు చక్షుఃపునఃప్రాణమిహానోదేహిభోగమ్.జ్యోక్ పశ్చేమ సూర్య ముచ్చరంత మనుమతే మృడయానః స్వస్తి"

(ఋ—అష్ట ౮. అ. ౧. వ౨౩. మం. ౧.)

ఈ పై మంత్రములో పూర్వోత్తరజన్మల విషయము ఇట్లు వర్ణింపబడినది. (అసునీతే) ప్రాణదాతవైన ఓ పరమేశ్వరా ! మేము మృతినొంది మరియొక శరీరమును ధరించినపుడుకూడ మమ్ములను నిరంతరముసుఖవంతులుగా చేయుము. (పునరస్మాసుచక్షుః) పునర్జన్మలో మాకు ఉత్తమములయిన

నేత్రములు మున్నగు నింద్రియముల నొసంగుము. (పునః ప్రాణం) ప్రాణవాయువు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, బలము, పరాక్రమము మున్నగువానితో మా తనువులు కూడియుండునట్లు అనుగ్రహింపుము. (ఇహనో దేహి భోగమ్) ఓ పరమేశ్వరా! ఈ జన్మమునందును పరజన్మమునందును మేము ఉత్తమభోగములను పొందుదుముగాక. (జ్యోక్ పశ్యేమసూర్య ముచ్చరంతం) ఓ దేవా! నీ దయవలన మేము సూర్యలోకమును శ్వాసప్రశ్వాసాత్మకమగు ప్రాణమును ప్రేమతో విజ్ఞానయుక్తులమై సదా చూతుముగాక. (అనుమతే మృడయానః స్వస్తి) ఓ యనుమాతీ! సర్వులకు మానము నొసంగు దేవా! సర్వజన్మములందును మాకు (మృడయా) సుఖములను చేర్చుము. అందువలన మాకు శుభము చేకూరుగాక. ఇదియే మా ప్రార్థన.

మంత్రము "పునర్ మైత్వింద్రియం పునరాత్మా ద్రవిణం బ్రాహ్మణం చ పునరగ్నయో ధిష్ణ్యా యథాస్థామ కల్పంతా మిహైవ."

(అధర్వ కం ౭ అను ౬. సూల ౭. మం ౧.)

(పునర్ మైత్వింద్రియం) ఓ దేవా! నీ కృపవలన పునర్జన్మమునందు మనస్సు మున్నగు పదునొకండు ఇంద్రియములు నాకు మరల లభించుగాక. అనగా సంతతము మనుష్యశరీరము ప్రాప్తించునుగాక. (పునరాత్మా) ప్రాణధారణము చేయు సమ

ర్గత నాకు లభించుగాక. అందుచే ఈ రెండవ జన్మమున ఆ జీవనపర్యంతము శుభాచరణము నొనర్చుచు బ్రతుకగలుగుదును. (ద్రవణం) సత్యవిద్యాది ఉత్తమ ధనముగూడ మాకు పునర్జన్మమున కలుగుగాక. (బ్రాహ్మణంచ) నిరంతరము వేదవ్యాఖ్యాన సహిత విజ్ఞానము దైవనిష్ఠయు మాకు లభ్యమగుగాక. (పునరగ్నయః) అటులే లోకోపకారమునకై అగ్నిహోత్రాది శుభకర్మల నాచరింతుముగాక. (ధిష్ణ్యాయథాస్థామ) ఓ జగదీశ్వరా! మేము పూర్వజన్మమునందు సుబుద్ధియు, ఉత్తమ శరీరేంద్రియాదులను ఎట్లు కలిగియుంటిమో అట్లే పునర్జన్మము నందును సద్బుద్ధితో మానవశరీరములకు చెందిన కార్యముల నొనర్చుటలో సమర్థులమగుదుము గాక. ఇవి అన్నియు విశుద్ధమగుబుద్ధితో పాటుగా (మైత్రు) నాకు లభ్యమగుగాక. (ఇహైవ) వానిలో మేమీలోకమున పునః మానవజన్మనొంది చతుర్విధ పురుషార్థముల సాధింతుముగాక. ఆ భక్తివలన మాకు ఏజన్మమునందును దుఃఖము కలుగకుండుగాక.

మంత్రము. "ఆ యో ధర్మాణి ప్రథమః ససాదతతో వపూంషికృణుషే పురూణి. ధాస్యుర్ యోనిం ప్రథమ ఆవివేశో యో వాచ మనుదితాం చికేత".

(అథర్వ. వే. ౫ అ౧ సూ౧ మం ౨)

(ఆ యో ధర్మాణి) పూర్వజన్మమునందు ధర్మాచరణము గావించిన మనుష్యుడు (తతో వపూంషికృణుషే పురూణి)

ధర్మాచరణమునకు ఫలముగ అనేకములయిన ఉత్తమ శరీరముల ధరించును. అధర్మాచరణ మొనర్చిన మనుష్యుడు నీచములైన పశువాది శరీరములను పొందును. ఈ మంత్రము నందలి అర్ధభాగమున ఈ విషయమునే భగవానుడు తెలిపెను. (ధాస్యేర్ యోనిం) పూర్వజన్మమునచేసిన పాపపుణ్యముల ఫలముల ననుభవించుచు జీవుడు పూర్వశరీరమును విడచి మొదట వాయువుతో నుండి తదుపరి జలము. ఓషధి, ప్రాణమున్నగువానియందు ప్రవేశించి వీర్యమునజేరును. అటుపై యోని గర్భాశయమున స్థిరుడై మరల జన్మించును. (యోవాచమనుదితాం ఆచికేత) వేదమునందు ఈశ్వరుడు ఆజ్ఞాపించినట్లు సత్యభాషణాదులు సరిగ చేయువాడై ధర్మమునందే (సనాద) దృఢముగనుండు నతడు పూర్వమువలెనే మనుష్య యోనియందు ఉత్తమ శరీరము ధరించి అనేక సుఖముల ననుభవించును. అట్లుగాక అధర్మము నాచరించువాడు పశుకీట పక్ష్యాది నీచ శరీరములను పొంది పలు దుఃఖముల ననుభవించును.

వేదములందు పూర్వాపరజన్మంబులు జీవునకుగలవని వర్ణించినట్లే నిరుక్తకారుడుగూడ పునర్జన్మమును ప్రతిపాదించి యున్నాడు.

సం॥ "స్వరస వాహీ విదు షోఽ పితథారూఢోఽ భినివేశః".

(పాతం. ప్తా. సూ౯)

(స్వరస) యోగదర్శనమును రచించిన పతంజలి మహర్షియు దానికి భాష్యకర్త యయిన వేదవ్యాసుడును పునర్జన్మము ఉన్నదని ప్రతిపాదించిరి.

ఉపనిషత్తులయందు "అంతే మతస్సామతి" అనగా జీవి అంత్యకాలమందు ఏధ్యాసతో మరణించునో తీరుగా ఆజన్మనే ఎత్తవలయునని చెప్పబడియున్నది. అందువలన కూడా మరల జన్మ యున్నట్లేనని మనకు తెలియుచున్నది.

సర్వోపనిషత్ సారమగు భగవద్గీత యందలి "జ్ఞాన యోగమున" శ్రీకృష్ణార్జునులకు జరిగిన సంభాషణమును పరికింపుడు.

శ్రీభగవానువాచ - శ్లో॥ ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహ
మవ్యయమ్।
వివస్వాన్ మనవే ప్రాహమనురిక్ష్వాకవేఽబ్రవీత్॥.

పార్థా! అవ్యయమయిన ఈ యోగమును మున్ను నేను సూర్యునకు ఉపదేశించితిని అతడు దీనిని వైవస్వత మనువునకు తెలిపెను. ఆమనువు ఇక్ష్వాకునకు దీనినుపదేశించెను.

అర్జున ఉవాచ · శ్లో॥ అపరంభవతో జన్మ పరంజన్మ వివస్వతః।
కథమేతద్విజానీయాంత్వమాదే ప్రోక్తవానితి॥

కృష్ణా! సూర్యుడు నీకన్న మున్నెన్నడో పుట్టినవాడు. నీవు ఇప్పుడు కలిగినవాడవు నీవీ యోగమును సూర్యునకు ఆదియందు ఎట్లు తెల్పితివి.

శ్రీభగవానువాచ - బహూని మే వ్యతీతాని జన్మానితవ చార్జున।
తాన్యహం వేదసర్వాణినత్వంవేత్థ పరంతప॥.

అర్జునా! నాకును నీకును అనేకజన్మములు గడచిపోయినవి. వాని విషయమంతయు నేనెరుంగుదును. కాని నీవెరుంగవు.

ఈ పై సంభాషణమును గమనించినచో మానవునకు పూర్వాపరజన్మంబులు గలవనుట స్పష్టమగుచున్నది గదా! ఇట్లే న్యాయదర్శనమునందు మహా విద్వాంసుడగు గౌతమ మహర్షియు, న్యాయసూత్రములకు భాష్యము వ్రాసిన వాత్స్యాయనమునియు పునర్జన్మమును అంగీకరించినారు.

ప్రపంచమునగల ప్రాణులన్నింటికి పుట్టినదాది మరణ భయముండును. ఆ మరణభయము జీవునకు పూర్వాపరజన్మములున్నవని రూఢిపరచుచున్నది. గతజన్మములందు కలిగిన మృత్యుభయానుభవమును ఇప్పుడు స్మరించి ప్రతిప్రాణియు మరణభయము నొందుట చూచుచున్నాము. పూర్వజన్మమున ప్రాణి మృత్యుభయమును అనుభవింపకయున్నచో దానికి సంబంధించిన సంస్కారము ఆప్రాణి అంతఃకరణమున ఏర్పడదు. సంస్కారములేనిచో స్మరణము గలుగదు. అట్టి యెడభయము కలుగుటకు వీలుండదు. ఇప్పుడిప్పుడే పుట్టిన ప్రాణికూడ భయము అనుదానినే కలిగియుండుట సర్వవిదితము. అట్టి భయము పూర్వజన్మయందు అనుభవించి యుండకున్నచో

యిప్పుడు కలుగుటకు వీలులేదు. అందుచే జీవునకు పూర్వా పర జన్మములున్న వనక తప్పదు.

ఇది యిట్లుండ పునర్జన్మనుగూర్చి పలువురు విదేశీయులు చెప్పిన విషయములను పరికింపుడు.

ఆర్థర్ యి. మాశే : చెప్పిన విధమేమన మానవప్రపంచ మందు చాలమంది పునర్జన్మకలదని తెప్పకఒప్పుకొనుచున్నారు. మరియు ఈ నమ్మకము చరిత్ర పుట్టినదాది కలిగియున్నది. పునర్జన్మను సమర్థించుటకు అనేక తత్వశాస్త్రజ్ఞులు చెప్పు సూత్రములు గాక అవిపూర్తిగా రుజువు చేయగల ఏడుజనసమ్మతము లైనకారణములు గలవు.

1) అమరత్వము విషయమై ప్రాపంచికాభిప్రాయము ననుసరించి నిజమై యుండవలెను.

2) పరిస్థితులనుబట్టి తప్పక అది నిజము కావలెను.

3) చాల విషయములందు విజ్ఞానశాస్త్రములో అనుగుణ్యముగనున్నది.

4) ఆత్మయొక్క స్వభావమును బట్టి అది అవసరము.

5) తత్వశాస్త్రసంబంధమైన మొదటి 'పాపము' 'ముందు శిక్ష' అను ప్రశ్నలకు పూర్తిగా జవాబు ఇవ్వగలదు.

6) విచిత్రమైన అనుభవములకు అసాధారణమైన జ్ఞాపకశక్తులకు అది సమాధానము చెప్పగలుగుచున్నది.

7) భౌతిక జీవనమందు శక్తి వహించినట్టి అన్యాయము మరియు బాధయొక్క సమస్యకు సమాధానము ఇదియే చెప్పగలదు.

క్రైస్తవుల బోధయగు 'ఏది నాటిన అదియే అనుభవమునకు వచ్చును' అనునది పురాతన బోధయగు పునర్జన్మ మరియు కర్మలకు సరిపోవును. గొప్పప్రతిభలను బాల్యమందలి అద్భుతశక్తులకు మరియు ప్రపంచమందలి గొప్ప తెలివి తేటలకు సరియైన సమాధానము కనిపించనందున పునర్జన్మమీదనే ఆధారపడవలసియున్నది. ప్రతివ్యక్తియు అనేకజన్మలు అనుభవించియుండును. అట్టి పూర్వానుభవమువల్ల వారుఇప్పుడు వివిధగుణములు గలిగినవారైయున్నారు.

డబ్లియు. ట్యూడర్ బోన్సు : ఈవిధముగా చెప్పిరి. మృత్యువు అనంతరము ప్రస్తుతమానవజీవనము ఇంకను జరుగుచుండుననియు దానిని త్రోసిరాజనుటకు వీలులేదనియు స్థిరపరచుటకు తత్వశాస్త్రము ముఖ్య ఆధారముగానున్నది. మనచావు అనగా ముందుజీవితమునకు మన పుట్టుకయే.

'గేతే' యీ విధముగా చెప్పిరి. మనకు కనబడుచున్న అంతము (చావు) నిజమైన అంతముకాదు. ఎందువలననగా అది ఆవ్యక్తి యొక్క నిజమైన సారమును అంటియుండదు. అదిచెడగొట్టునది తాత్కాలికముగా నుండురూపము మాత్రమే యని 'గేతే' చెప్పియున్నారు.

ఆత్మ అనునది సృష్టింపబడునది కాదు. అది శాశ్వతమైనది. మరియు మనుష్యరూపమునుండి జంతురూపములోనికి పోయి పోయి తిరిగి దానినుండి మనుష్యరూపములోనికి వచ్చునది అదియేనని ప్లేటో అభిప్రాయము.

2. పునర్జన్మ కలదని నిరూపించు ప్రత్యక్ష సాక్ష్యములేమైన కలవా ?

పునర్జన్మ కలదని నిరూపించుటకు మనదేశమునందేగాక విదేశములందుగూడ జరిగిన అనేక సంఘటనలు ప్రత్యక్షసాక్ష్యములుగానున్నవి. ఉదాహరణకై ఒకటిరెండు సంఘటనలను ఇచట పొందుపరచుచున్నాను.

అమృతబజార్ పత్రిక 1949 ఆగస్టునెలలో ప్రకటించిన అత్యద్భుతమైన పునర్జన్మ విషయమును పరికింపుడు- 1926వ సంవత్సరము అక్టోబరు 12వ తేదీన ఢిల్లీ నగరమున శాంతాదేవి యను నొక బాలిక జన్మించినది. ఆమెమాట్లాడుట నేర్చినది మొదలు తనపూర్వజన్మ విషయములను గూర్చియు, ఆజన్మయందు తనదినచర్యలను గూర్చియు, మధురాయను గ్రామములో తనభర్తయగు కేదార్‌నాద్‌జీతో తాను గడిపిన జీవితానుభవములను గూర్చియు తన గతజన్మము 1902 నుండి 1925 వరకు గడచినదనియు సమస్త విషయములను పూసగ్రుచ్చినట్లు చెప్పసాగినది. ఆబాలిక తల్లిదండ్రులు ఆమాటలను మొదట విశ్వసించలేదు. అవి పిచ్చిమాటలనిఎంచి పిల్ల

పెద్దదైన తరువాత ఆమెజ్ఞాపకశక్తినుండి అవియన్నియు అదృశ్యమగుననెడు నమ్మకములో నుండిరి. కాని అందుకు వ్యతిరేకముగా ఆమె పెరిగిన కొలది ఆమె గతజన్మపు జ్ఞాపకములు గూడ పెరుగసాగినవి. శాంతాదేవి తన పూర్వజన్మయందలి భర్తయొక్క చిరునామాను తల్లిదండ్రులకిచ్చి వానిని పిలిపింపుడని కోరెను. వారట్లే చేసిరి. అపుడు శాంతాదేవియొక్క పూర్వపుభర్తయైన కేదార్‌నాధ్ మూట్రా నుండి ఢిల్లీకి వచ్చెను. శాంతాదేవి కేదార్‌నాధ్‌ను చూచిన వెంటనే అతడు తన భర్తయని గుర్తుపట్టెను. చాల సమయమువరకు పాత పరిచయముల నొకరి కొకరి చెప్పుకొనిన పిదప ఆమె తన పూర్వపుభార్యయొక్క ఆత్మయని కేదార్‌నాధ్ ఒప్పుకొనెను. ఆ శాంతాదేవి చెప్పుచున్న విషయములలోని సత్యములను పరిశీలించుటకు విచక్షణాపరులు సమర్థులునగు పెద్దలతో ఒక కమిటి ఏర్పడెను. ఆమె అవరోధమువలన ఆ కమిటి వారున్నూ ఆమె తలిదండ్రులున్నూ ఆమెను మూట్రా కు తీసుకొనిపోయిరి. మూట్రా రైలుస్టేషను చేరిన వెంటనే ఆమె 'మూట్రా' 'మూట్రా' అని కేకవేసెను. ఆ బాలికను దేశబంధు గుప్త యను ఒక వ్యక్తి ఎత్తుకొని యుండెను. అట్లు పోవుచుండ త్రోవలో ఒక ముసలివానినిచూచి ఆ బాలిక గుప్తగారిచేతి నుండి క్రిందకుదూకి ఆ ముసలివాని కాళ్లకు ప్రణామముచేసి ఆయన తన పూర్వపు భర్తయొక్క అన్నగారగు బాబూరావు చేబిగారని చెప్పెను. ఆ విషయములు నిజమగుట వలన ప్రజ

లందరు చకితులై ఆమెను భయముతోను మర్యాదతోను చూడసాగిరి. స్టేషనునుండి తన భర్తయింటికి త్రోవ ఆమెయే చూపెను. అచట ఆమె తన గతజన్మలోని అనేక విషయాలను వివరించి అందరిని ఆశ్చర్యసాగరమున ముంచివేసెను. తరువాత ఆమెను ఆమె పూర్వపు తలిదండ్రుల యింటికి తీసుకొనివెళ్లిరి. అటకు చేరుటతోడనే ఆమె తన తలిదండ్రులను గుర్తించి వారిని కౌగిలించుకొని ఏడ్వసాగెను. ఆమె యిష్టములేకున్నను ఆమెను వారివద్దనుండి బలవంతముగా తీసుకొనివచ్చిరి. ఈ విషయములు భారతీయ పత్రికలందేగాక విదేశీయ వార్తా పత్రికలందుగూడ ప్రచురించబడినది. ఇట్టి విషయములు హిందూదేశమునందు క్రొత్తవిగావు.

ఒక విదేశీయుడు తెల్పిన పూర్వజన్మానుభవమును పరికింపుడు. సోల్జర్ కాస్టర్ బర్మాదేశపు స్పీకరుగా నుండెను. అతని పేరు జార్జి కాస్టర్. అతడు 1935లో లండను సన్‌డే ఎక్స్‌ప్రెస్‌లో తన గతజన్మ జ్ఞాపకములనుగూర్చి యిట్లు తెలియపర్చెను. అతడు 1889వ సంవత్సరములో జన్మించి 1909వ సంవత్సరములో అనగా అతని 20వ ఏట బర్మాలో గల మేమెయో అను గ్రామమునకు పంపబడెను. ఆ దేశము తనకు పూర్వ పరిచయముగల దేశమనియు అందుతాను నివసించి యుందుననియు ఐర్రావతి నదినిగూడ ఎరుగుదుననియు మరియు ఆ నదికి ఆవలియొడ్డున ఒక పెద్ద దేవాలయముగల

దనియు దాని గోడకు పైనుండి క్రిందకు పెద్దపగులుండెననియు ఒక లాన్సు కార్పోరల్ కాంగన్‌తో అతడు చెప్పగ అది విని అందరును ఆశ్చర్యపడిరి. ఈ విషయమై తలిఖి చేయగ అతడు చెప్పిన విషయమంతయు పూర్తిగ నిజమయ్యెను. ఆతనికి గలిగిన యీ జ్ఞాపకములు ఆతని గత జన్మమునకు సంబంధించిన వని సర్వులును అంగీకరించిరి. ఇట్టి పూర్వజన్మానుభవములను గూర్చి మన దేశమునందును విదేశములందును ఈ నడుమ వందల కొలది వ్యక్తులు విచిత్రములైన విషయములను తెలిపి యున్నారు అవి అన్నియు 'Illustrated weekly' మున్నగు పత్రికలలో వరుసగా ప్రకటింపబడెను. ఈ గతజన్మ విషయము లను పరిశోధించుటకు విదేశములలో నిప్పుడు ప్రత్యేక విశ్వ విద్యాలయములు నెలకొల్పబడినవి పూర్వాపర జన్మములు గలవనుటకు ఇంతకంటె ప్రత్యక్షసాక్ష్యములు ఇంకేమి కావలయును.

3. తనపూర్వజన్మ వృత్తాంతము ప్రతిమానవునకును ఏల జ్ఞప్తి యుండుటలేదు ?

మనపసితనమున గలిగిన విషయాలు మనకుజ్ఞప్తియందు న్నవా ? లేవు. జ్ఞాపకము లేనంతమాత్రమున మనకు పసితనమే లేకుండెను అందుమా ! కొలదికాలము క్రితముజరిగిన చిన్న నాటి విషయములే జ్ఞప్తి యందుంచుకొనజాలని మనుష్యుడు గడచిన జన్మల విషయములను ఎట్లుజ్ఞాపకమునందు ఉంచుకొన

గలడు. మానవునకు పూర్వజన్మ జ్ఞానములేకుండుటకు ప్రధాన కారణము మరియొకటి యున్నది. మనుజునకు తనపూర్వజన్మ స్థితిస్పష్టముగా తెలిసినయెడల అతని వర్తమాన జీవితము ప్రశాంతముగా గడచుట దుర్లభము. ఆతడు తన పూర్వజన్మ మున ఆచరించిన పాపములన్నియు జ్ఞాపకమునందు ఉన్నచో సంతతము వానిని గూర్చియే ఆలోచించుచు నిరంతరచింతతో నిద్రాహారములను లేనివాడై క్షీణించి పోగలడు. అందుచే కరుణామయుడైన పరమాత్మ మానవునకు గతజన్మల జ్ఞానము కలుగకుండునట్లు చేసినాడు. ఆత్మసంయమము, ఆత్మజ్ఞానము కలిగిన మహాత్ములైన బుద్ధుని వంటివారికి మాత్రమే పూర్వాపరజన్మల జ్ఞానము కలిగినది.

మరణించిన ప్రాణి ప్రేతయగుట కూడ పునర్జన్మను సూచించుచున్నది. "పునరుత్పత్తిః ప్రేత్యభావః" పూర్వశరీరమును విడచిమరి యొక శరీరమును ధరించుటనే ప్రేత్యభావ మందురు. ప్రేత్య=మరణమును పొంది (చచ్చి) భావః మరల శరీరమును ధరించుట (జీవుడు మరల శరీరము గలవాడగుట.)

4. మరణించిన పిదప తిరిగిజన్మించుటకు సరిగాఎంతకాలము పట్టును ?

ఈవిషయమైకాల నిర్ణయమును తెల్పుట అత్యంతకష్ట సాధ్యము. ఏలననగా ప్రతివ్యక్తి చేయుకర్మయొక్క స్వభావము మరణకాలమున ఆవ్యక్తి చేయు ఆలోచనలు మున్నగుకారణ

ములచేత మరణించిన వానికి పునర్జన్మ కలుగుటకు కొన్నిదినములు కొన్నినెలలు కొన్నిసంవత్సరములు లేక కొన్ని వందల సంవత్సరములుకూడపట్టవచ్చును. కొన్నిప్రాణులు వాని కర్మఫలములను ఇతర సూక్ష్మభూమికలలో అనుభవించుచుండుటచే క్రొత్తశరీరమును పొందుటకు చాలకాలముపట్టును. దివ్యములైన కొన్నిఆత్మలు మరల శరీరమును ధరించుటకు బహుకాలము పట్టును. ఏలననగా భూలోకమున ఒకసంవత్సరకాలము దివ్యభూమికలలో ఒక దినముతో సమానము. సూక్ష్మ భూమికలలో కర్మఫలముల ననుభవించు వారు సూక్ష్మశరీరముతో వానిననుభవింతురని పెద్దలవాక్కు.

5. సూక్ష్మ శరీరమనగానేమి ?

సూక్ష్మశరీరమనగా గాలిబంతిలోనుండు రబ్బరుబ్లాడరు వలె స్థూలదేహములోపల నుండునది. ఇదిస్థూలశరీరముయొక్క సరియైన ప్రతిరూపము.

6. ప్రతివాడును మానవజన్మనే మరల మరల కోరుకొనుటకు గలకారణమేమిటి ?

ఈ సృష్టిలో మానవుడు సర్వశ్రేష్ఠుడైనప్రాణి. మానవుడు బుద్ధిజీవి. అతడు హృదయము, బుద్ధి, శరీరముల అద్భుత సమ్మిశ్రణస్వరూపుడు. హృదయముద్వార అనుభూతిని పొందగలడు. బుద్ధిచే ఆలోచించగలడు. శరీరేంద్రియములద్వార ఆ ఆలోచనలకు రూపము నివ్వగలవాడు ఇట్టిశక్తి మానవేతర ప్రాణులలోలేదు. కనుక భూమియందు మానవ జీవితము

అత్యంత ఆకర్షణ కలదై యున్నది. అతడు గతజన్మలలో అనుభవించిన సుఖానుభూతుల వాసనలు కలిగియుండుటచేతనే మరల మరల మనుష్య జన్మమే కావలయునని కోరుకొనుచుండును.

7) భూలోకమునగల ప్రతిజీవియు నిట్లు మరణించుచు మరల పుట్టుచు నున్నది కదా! ఏకారణము లేక యే ప్రాణులు పుట్టుట చచ్చుట జరుగుచున్నదా? లేదా చావు పుట్టుకలకు కారణమేమైన కలదా?

చావుపుట్టుకలు ఒక ప్రత్యేకమైన చట్టము ననుసరించి జరుగుచున్నవి. అ చట్టమునకు అన్ని చట్టముల లోబడినవియే. ప్రతికార్యమునకు కారణము ఉండియే తీరవలయును. కావున మానవుల చావు పుట్టుకలు నిష్కారణముగ కలుగుటలేదు. మానవులాచరించు కర్మల ఫలితములే వానిచావు పుట్టుకలకు జీవిత విధానములకు వారి సుఖదుఃఖములకు ప్రధాన కారణములు. దీనినే కర్మసిద్ధాంతము లేక కర్మచట్టము అనుచున్నారు. పూర్వాపరజన్మల కార్యకారణచట్టమిదే.

—o—

కర్మ

8. కర్మలనగా నేమి ? అవి జన్మలకెట్లు కారణమగు చున్నవి? వాని ఫలితములు మానవులు ఎట్లు అనుభవించుచున్నారు?

జీవితమున మానవుడు ఆచరించు పనులన్నియు కర్మలు అనబడును. ప్రత్యక్షముగాగాని పరోక్షముగాగాని లోక హితము కొరకు కావించు కర్మలన్నియు సత్కార్మలు. లోక హితమునకు హానిచేకూర్చు కర్మలన్నియు దుష్కార్మలు. మానవుడు ఈ కర్మలకు స్వయంకర్త స్వయంభోక్త అయి యున్నాడు. ఆ కర్మల ఫలితముల ననుసరించియే మనుష్యునకు హానివృద్ధులు సుఖదుఃఖములు లాభనష్టములు ఆరోగ్య భాగ్యములు పునర్జన్మములు లభించుచుండును. దైవము ఆ కర్మలకు సాక్షియై యుండి ఆయాకర్మల ఫలములను మానవులు అనుభవించునట్లు విధించుచుండునేగాని మానవుని కర్మాచరణమును మార్చుట మాన్పుట మున్నగు ఎట్టి కార్యములు చేయదు. కావుననే దైవలక్షణములనుగూర్చి "ఉదాసీనవదాసీనః" అని శాస్త్రములు పల్కినవి. భగవత్ ప్రసాదితమైన బుద్ధి జ్ఞానము మానవునకు లభించి యుండుటచేత మనుష్యుడు తానాచరింపదగు కర్మల నిర్ణయించుకొనుటకు జీవితమును ఉత్తమముగా తీర్చి దిద్దుకొనుటకు సమర్థుడైయున్నాడు. ఆతడు తన యీ సామర్థ్యమును సద్వినియోగము చేసుకొనక దుష్టకార్యముల నాచరించినచో దుష్ఫలితమును అనుభవించక

తప్పదు. మానవుడు ఆచరించు మంచిని పుణ్యమనియు, చెడును పాపమనియు వ్యవహరించుచున్నాము.

9. ఒక్కొక్క సందర్భమున మంచిదిగా పరిగణింపబడిన పని మరియొక సందర్భమున చెడుగా రూపొందుచుండుట లోకమున కలదుగదా ? పాపపుణ్యములు పనినిబట్టి ఏర్పడునా లేక ఎట్లేర్పడును ?

పాపపుణ్యములు మానవుడాచరించు పనులనుబట్టి కలుగవు. ఆ పనులు చేయుటకు కారణములైన సంకల్పములను బట్టి కలుగుచుండును. బంగారుగాజులతో నిండియున్న ఒక స్త్రీ హస్తమును ఒక దొంగవాడు ఆ గాజులు హరించు సంకల్పముతో ఖండించుచున్నాడు. వ్యాధిగ్రస్తమైన హస్తముగల ఒక స్త్రీయొక్క శేషాంగశ్రేణిని రక్షించు సందర్భములో ఒకవైద్యుడు రోగముచే చెడిన ఆ హస్తమును శస్త్రచికిత్స విధానమున ఖండించుచున్నాడు. దొంగవాడును వైద్యుడును స్త్రీహస్తమును ఖండించుట అను పనినే చేయుచున్నారు. ఇరువురు చేయుపని ఒక్కటియే అయినను సత్ సంకల్పముతో ఉపకారబుద్ధితో చేతిని ఖండించు వైద్యునకు పుణ్యమును దుస్సంకల్పముతో అపకారబుద్ధితో హస్తమును ఖండించు దొంగకు పాపమును సంక్రమించుచున్నవి. కావున పాపపుణ్యములు పనులను బట్టియుండక ఆ పనులు జరుగుటకు కారణములైన సంకల్పములను బట్టి యుండును. ఇటులే లోకమందలి

సర్వ కార్యములకు పాపపుణ్యములు సంక్రమించును. ఈ కార్యముల ఫలాఫలముల ననుసరించియే జన్మములులభించుచుండును. మానవుని యీ కర్మలను శాస్త్రములు మూడు విధములుగా విభజించి చెప్పినవి. 1) ఆగామి కర్మ. 2) సంచిత కర్మ, 3) ప్రారబ్ధ కర్మ.

10. ఆగామి కర్మ యనగానేమి ?

మానవుడు ఒక జన్మమున ఆచరించు కర్మ ఫలితముల ననుసరించి మరుజన్మము కలుగునని తెలిసినదికదా! అట్లు మరుజన్మమున శుభాశుభములను కల్గించు కార్యములు ఆగామి కర్మలనబడును. ఈ జన్మమున మనము ఆచరించు ఏ పనులైతే మరుజన్మమునకు కారణభూతము లగుచున్నవో అవి ఆగామి కర్మలనబడును.

11. సంచిత కర్మ యనగానేమి ?

పూర్వజన్మములలో మనము ఆచరించి నిలువచేసికున్న కర్మల ఫలము సంచిత కర్మమనబడును. ఇందు సత్కర్మల ఫలితము దుష్కర్మల ఫలితము రెండును నుండును.

12. ప్రారబ్ధ కర్మ యనగా నేమి ?

పూర్వజన్మములలో సముపార్జించుకొని యున్న సంచిత కర్మమునుండి యీ జన్మమున మనము అనుభవించుటకుగాను విధిచే నిర్ణయింపబడి యొసగబడు కర్మఫలమే ప్రారబ్ధము అనబడును. ఇట్లు ప్రారబ్ధముగ లభించు పుణ్యపాప కర్మల ఫలము

లను ప్రతిమానవుడును అనుభవింపకతప్పదు. ఈ ప్రారబ్ధకర్మ ననుభవించుటకే మానవుడు యీజన్మమును పొందియున్నాడు. ఈ విధిని దాటుటకు ఎవ్వరును సమర్థులుకారు. బ్రహ్మాదులకు గూడ యీవిధి అవశ్యభోక్తవ్యము. మానవుడు యీ జన్మమున అనుభవించు సుఖము, దుఃఖము, సంపద, దారిద్ర్యము, ఆరోగ్యము, అనారోగ్యము, కీర్తి, అపకీర్తి, లాభనష్టములు మున్నగు సర్వవిషయములును ఆతని ప్రారబ్ధము ననుసరించియే నిర్ణయింపబడినది. ఈ ప్రారబ్ధ కర్మఫలములు మానవునకు ముందుగనే తెలియకుండగనే అప్రయత్నముగ లభించుచుండును. మానవునకు ప్రపంచమున సర్వమూ అనగ జీవితమున అతనికి లభించు ప్రతి విషయము ఆతని ప్రయత్నము వలన కార్యములవలన కలుగును. ఆ ప్రయత్నములకు కార్యములకు మూలము ఆతనిబుద్ధి. మానవుడు తనకు పుట్టుబుద్దిని బట్టి పనిచేసి శుభాశుభ ఫలము లనుభవించుచున్నాడు. ఏ పనియైనను చేయవలయునను బుద్దిపుట్టినప్పుడే మానవుడు చేయును. అన్నము తినవలయునను బుద్ది పుట్టినపుడు తినును. నిద్రించవలయునని బుద్ధి పుట్టినపుడు నిద్రించును. కూర్చొనవలయుననెడు బుద్ధి కలిగినపుడు కూర్చొనును. నిలువ వలయుననెడు బుద్ధి కలిగినపుడు నిలచును. ఇట్లు మానవుడు చరించు ప్రతి పనియు జరుగుటకు ఆతని బుద్ధి కారణమగుచున్నది. బుద్ధి ఆతని ప్రారబ్ధకర్మము ననుసరించియే కలుగుచుండును. కనుకనే "బుద్ధిః కర్మానుసారిణీ" అని గీతాచార్యుడు

నుడివినాడు. అందుచే మానవుడు సుఖములు అనుభవించుట కేవలము అతని తెలివితేటలవలన జరుగునని లేక కష్టము లనుభవించుట అతని తెలివితక్కువ చేతనని భావించుట తగదు మానవునకు చిన్న వయసులోనె మాతృవియోగదుఃఖము, పితృ వియోగదుఃఖము, అటులనే తల్లి తండ్రులకు గర్భశోకము; కొందరు పిల్లలు గర్భములోనె చనిపోవుట, కొందరు ఆకస్మిక మరణములు నొందుట, కొంతమంది అర్ధాయుష్కులై మరణించుట మరికొందరు నూరేళ్ళకు మించిన కాలమువరకు బ్రతుకుట కొందరు వికలాంగులుగా పుట్టుట, పుట్టిన తదుపరి కొందరు వికలాంగులగుట కొందరు అందలము లెక్కుట కొందరు అన్నముకొరకై అలమటించుట కొందరు ఘోరవ్యాధులచే బాధపడుట, కొందరు మిక్కిలి ఆరోగ్యవంతులు, బలవంతులగుట, కొంతమందికి అకస్మాత్తుగా లాటరీవంటి వాటిలో ధనము లభించుట, కొంతమందికి వున్న సంపదలన్నియు వూడిపోవుట మున్నగు సకల విషయములకు గతజన్మల కార్యములే కారణములు. ఇట్టివానియందు మానవుని ప్రయత్నముతో ప్రమేయము లేకుండా లభించు శుభాశుభములకును అట్టికార్యములు ఆచరించు బలీయమైన బుద్ధికిని ప్రారబ్ధకర్మయే ప్రధాన కారణమని తెలియనగును.

12. మానవుని జీవితమున జరుగు సమస్తమునకు గతజన్మల కర్మఫలితమే కారణమైయుండి అది అనివార్యముగ అనుభ

వింపవలసి యున్నప్పుడు ఎట్టి పుణ్యకార్యములచేతను ప్రారబ్దము నశింపని పక్షమున భగవత్‌భక్తివలనను పుణ్యకార్యాచరణముల వలనను గలుగు ప్రయోజనమేమి?

ఎంతవారికిని ప్రారబ్ధమును అనుభవించుట తప్పదు అనుట ప్రత్యక్షర సత్యము. ఈ విషయాలను స్పష్టముగా తెల్పుచు శ్రీ శివానంద సరస్వతి మహారాజ్‌వారు చెప్పిన యితి హాసమును పరికింపుడు. పూర్వము పండరినాథ్ అను ఒకభక్తుడు కలడు. అతడు నిరంతరము దైవసేవ గావించుచు జీవించు చుండెను. ఆతనికి ఒకతల్లి తప్ప నా యనువారెవ్వరును లేకుండిరి. ఆ తల్లికూడ మరణించెను. అపుడు ఆ భక్తునకు మాతృవియోగ దుఃఖము కలుగలేదు. ఓ దేవా ! నాకుగల ఒక్క బంధనమునుగూడ నేటితో త్రెంచివేసి నీసేవ నిరంత రాయముగ కొనసాగించు అవకాశమును కల్పించితివి అని, భగవంతుని స్తోత్రముచేసి మిక్కిలి సంతోషించెను. అటుపై అహోరాత్రములు పరమాత్మ సేవయందే మునిగియుండి అన్న పానీయములను కూడ మరచిపోయెను. అచట జనార్దనస్వామి దేవాలయము ఒకటి కలదు. అందున్న స్వాములవారు ఆభక్తుని స్థితిని గమనించి తన అర్ధాంగియైన లక్ష్మితో దేవీ ! "అనన్యాశ్చింతయంతో మాం యేజనాహపర్యుపాసతే। తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహం." అని భక్తు

లకు మాటయిచ్చి యుంటినిగదా! ఆమాట ననుసరించి యీ భక్తుని యోగక్షేమములను పరికించుట మన కర్తవ్యమై యున్నది. కావున నీవు యీబంగరు పళ్లెరమున పంచభక్ష్య పరమాన్నములనుంచి ఆ భక్తునకు అందించిరమ్మని చెప్పెను. అంత నాలక్ష్మీదేవి భోజ్య పదార్థములను తీసుకొనిపోయి ధ్యాననిమగ్నుడై యున్న పండరినాథ్ వద్ద ఉంచి అదృశ్య మయ్యెను. పండరినాథుడు కనులుతెరచి కోరకనే లభించిన ఆ ఆహారమును భుజించి మరల దైవధ్యానమున మునిగి పోయెను. అట దేవాలయములో బంగరు పాత్రలు కనుపింపక అర్చకులు ఆందోళనపడి వానికై వెదకుచు కనులు మూసు కొని నిద్రించుచున్న మునివలెనున్న పండరినాథ్ చెంత ఆ పాత్రలుండుట గమనించి ఆ భక్తునే దొంగగా భావించి పట్టి బంధించి రాజసముఖమునకు నీడ్చుకొని పోయిరి. రాజు ఆ భక్తుని అత్యంత కఠినముగ కొరడాలతో కొట్టించి శిక్షించెను. నాటిరాత్రి రాజునకు జనార్దనస్వామి స్వప్నమున దర్శన మిచ్చెను. స్వామి శరీరమున వాతలుతేలి రక్తమయమై యుండెను. వెంటనే రాజు నిద్రనుండి మేల్కొని శ్రీజనార్దన స్వామివారి దేవాలయమునకు వెళ్ళి చూడగా స్వామివారి విగ్రహమునుండి రక్తము కారుచుండెను. ఆ వింత దృశ్యము సర్వులను ఆశ్చర్యపరచినది. పండరినాథ్ శరీరముపై పడిన కొరడా దెబ్బల వాతలు స్వామివారి విగ్రహముపై కనుపించు టను చూచి రాజు తన తప్పును తెలిసికొని భక్తాగ్రగణ్యుడగు

పండరినాథ్‌ను అచటకు పిలిపించెను. స్వామివారి శరీరము నుండి స్రవించుచున్న రక్తమునుచూచి ఆ భక్తుడు దీనాతి దీనముగా ఏడ్వసాగెను. అంత స్వామివారి శరీరమునుండి రక్తము స్రవించుట ఆగిపోయెను. పండరినాథ్ వ్యాకులపడుచు పరంధామునిచూచి ఓ భక్తరక్షకా! నిరపరాధినగు నన్ను రాజదండమునకు గురిచేసితివి. నాకు ఇవ్వబడిన శిక్షను నీవు అనుభవించితివి. అట్లుకాక రాజదండనమునే ఆపి యుండిన ఈ బాధ కలిగి యుండెడిది కాదుగదా! అని ప్రశ్నింప స్వామివారు ప్రత్యక్షమై యిట్లనిరి. భక్తా! ప్రారబ్ధమును అనుభవింపవలసినదే. నీ ప్రారబ్ధము ననుసరించి నీకు యీ రాజదండన లభించవలసి యున్నదికాని నీవు ఆత్మజ్ఞానము కలిగియున్నవాడవై భక్తి యోగమును సాధించి నాకు సర్వసమర్పణము చేసుకొన్నవాడవగుటచే నీకు సంక్రమింపవలసిన సర్వఫలములును నాకు చెందినవైనవి. అందుచే ఆ బాధకూడ నాకే అందినది. నా భక్తాగ్రగణ్యులైన ప్రహ్లాదుడు, మున్నగువారి జీవితములు ఈ సత్యమును ప్రకటించుచున్నవిగదా! కావున ఏ మానవుడు నా చింతనము గలిగి జ్ఞానయుక్తుడై తన సర్వస్వమును నాకర్పించునో ఎవ్వడు ఈ ప్రపంచమున నిస్సంగత్వమును సాధించి తాను నిమిత్తమాత్రుడై నేనొసగిన బాధ్యతలను నిర్వర్తించునో అట్టివానికి కర్మఫలములు అంటవు. ఆతనికి ప్రారబ్ధ ఫలమంటదు. అట్టియెడ కర్తయు, కార్యమును, భోక్తయు నేనే యగుదును. అర్జునునకు భగవద్గీతద్వార ప్రబోధించిన పరమార్థ

మిదియేనని పల్కి ఆ పండరినాధునకు ముక్తినొసంగెను. ఈ చరిత్రను పరికించినచో మానవుడు దైవభక్తి గలిగి యుండవలయునని విశదమగును. దైవార్పణ బుద్ధితో సమస్తమును నిర్వహించు వానికి కర్మఫలములు అంటకుండుటయేగాక ఆతడు కలిగి యుండిన సంచితకర్మ శేషమునుసరించి మరియొక జన్మము కలిగినను ఈ జన్మమున ఆతడు ఆచరించు సత్కార్యముల ఫలమే ఆగామి కర్మగా రూపొంది వానికి గలుగు మరుసటి జన్మము ఉత్తమమైనదిగను, ముక్తిదాయకమైనదిగాను, రూపొందును. కావున ప్రతిమానవుడు తప్పక సదాచారపరుడై దైవచింతనారతుడై జ్ఞానముక్తుడై భక్తుడై జీవింపవలసియున్నది.

సామాన్య మానవునకు నిస్సంగత్వమును సాధించిన జ్ఞానయోగికి ప్రారబ్ధము ననుసరించి వ్యాధియో, క్షతియో, ప్రమాదమో కలుగుట తప్పక జరుగును. కాని శరీరమును మనస్సును వేరుగా నుంచగల సాధకుడు తనకు గలిగిన బాధను అనుభవించుచున్నట్లు కనిపించు చుండునేగాని ఆ బాధ వలన అతనికి కష్టము గలుగదు. ఉదాహరణకు ఒక మనిషి తన మనస్సును ఒకానొక విషయమునందు పూర్తిగ సంలగ్నమొనర్చి అతివేగముగా పోవుచున్నాడనుకొనుము. మార్గమున అతనికి ఆకస్మికముగా ఒక ఎదురుదెబ్బ తగిలి వ్రేలుచిట్లి రక్తము స్రవించును. కాని అతడు అన్యాక్రాంత చిత్తుడై యుండుటచేత దానిని గమనింపడు. తరువాత కొంత సమయ

మునకు ఆతని దృష్టి ఆకాలి వ్రేలిపైబడి ఆతని మనస్సు దానిపైపునకు మరలినపుడే వానికి ఆ బాధ తెలియును. ఇది సర్వసాధారణముగా జరుగు విషయము. వానికి దెబ్బతగిలిపుడు వాని మనస్సు శరీరమునంటి యుండక అన్యవిషయమున సంలగ్నమై శరీరమునకు వేఱై యుండుటచేతనే యిది సంభవించినది. కావున శరీరమును మనస్సును వేరుపరచి యుంచగల జ్ఞానయోగులకు సాధకులకు ప్రారబ్ధవశమున సంభవించిన వ్యాధులు మున్నగు కష్టములు వారి శరీరమునకు అంటియుండి బాధించుచున్నట్లు కన్పించుచున్నను నిజమునకు వారు ఆ బాధ నొందరు. వారు ప్రారబ్ధమును ఈ విధముగ అనుభవింతురు. అట్టివారు సుఖము పొందిన పొంగరు, దుఃఖముగలిగిన విచారించరు. వారు సుఖదుఃఖములకు అతీతులై యుందురు. కావున ఆధ్యాత్మిక పరిజ్ఞానముచే మానవుడు ప్రారబ్ధమును అవలీలగా అనుభవించగలడు అని తెలియుచున్నదిగదా!

14. ఒక శరీరమును విడిచిన జీవి (మరణించినవాడు) మరల ఏ విధమున మరియొక శరీరమును ధరించుచున్నాడు (పునర్జన్మమును పొందుచున్నాడు ?)

జీవి ఒక జన్మమున తనకై నిర్ణయించబడిన కర్మానుభవమును పొందిన తరువాత మరణించును. పంచభూతాత్మకమైన ఆతని దేహము పంచభూతములలో విలీనమగును. అటుపై ఆ జీవుడు శేషకర్మానుభవముకొరకు వర్షాది రూపమునవచ్చి ఆహారరూపమున స్త్రీ పురుషులయొక్క గర్భాశయములను జేరి

అన్నసారభూతమగు శుక్లశోణితముల రూపమును ధరించును. పురుష రేతస్సు ఋతుకాలమునందు భార్యయందు ప్రవేశపెట్ట బడి శోణితముతో కలసి జీవాశ్రయమగు మరియొక శరీరము ఉత్పత్తియగుటకు హేతువగుచున్నది. శిశుజన్మమునకు పూర్వ మును జననకాలమందును అటు తర్వాతను గూడ శిశువును తలిదండ్రులు కాపాడుచున్నారు. ఈ శిశువులే ముందు సంతతి అవిచ్ఛిన్నముగా సాగుటకు కారణమగుచున్నారు. ఇదియే జీవులజన్మ విధానము.

15) మానవుడు ఎల్లప్పుడు గతజన్మల కర్మలఫలముల ననుభ వించుచు చచ్చుచు పుట్టుచు నుండవలసినదేనా ? లేక ఈ జనన మరణ చక్రమునుండి మానవుడు తప్పించు కొనుటకు వీలున్నదా ?

మానవుడు నిరంతర సాధనచే మోక్షమును పొందుట ద్వార యీ జనన మరణ చక్రమునుండి తప్పించుకొన వచ్చును.

— o —

మోక్షము

16) మోక్షమనగా నేమి ?

మోక్షమనగా విడుదల, ఎందుండి యీ విడుదల అని నపుడు బంధమునుండి అని జవాబు వచ్చును. బంధమనగా అస్వాతంత్రత. అస్వాతంత్రునకు భయము, దుఃఖములుండును. ఈ భయదుఃఖములు కలిగించినది జగత్తు. ఈ జగత్తునకు కారణము అజ్ఞానము. కావున యీ జగత్తు సత్యమని యెంచుటయే అజ్ఞానము. ఆ భ్రమవలననే బంధము కలుగును. ఆ బంధము నశించినపుడే మానవుడు ముక్తుడు, స్వాతంత్రుడు కాగలడు. బంధమునకు హేతువు అజ్ఞానమని తెలిసినదిగదా ! బంధము నశించవలయునన్న ఆ అజ్ఞానము నశింపవలయును. అజ్ఞానమువలన అహంకారము జనించును. అహంకారమువలన సంకల్పము కలుగును. సంకల్పమే కర్మకు కారణము. కర్మముల వలన సుఖము, దుఃఖము మున్నగు అనుభవములు కలుగుచున్నవి. ఆ అనుభవములు వాసనారూపములుగా హృదయమునకు హత్తుకొని నిలుచుచున్నవి. ఆ వాసనలు మరుజన్మమునందును స్మృతిని గల్గించుచున్నవి. స్మృతి పురుషుని తిరిగి కార్యోన్ముఖునిగా చేయుచున్నది. కావున యీ సంకల్పమే (కోరికయే) బంధమునకు మూలకారణ మగుచున్నది. సంకల్పమునకు ఆధారము మనస్సు. మనస్సు త్రిగుణాత్మకము. ఈ మనస్సే అజ్ఞానమునకుగూడ ప్రతిరూపమగుచున్నది. కావున

మనస్సు నశించినచో సంకల్పములు అజ్ఞానము వాటియంతట అవియే నశించును. యథార్థమగు ఆత్మజ్ఞానమువలన అజ్ఞానము (మిథ్యాజ్ఞానము లేక అవిద్య) నశించును. అపుడు జీవునియందు గల రాగద్వేషములనెడి దోషములు నష్టమగును. అటుపై ప్రవృత్తి, అధర్మము, అన్యాయము, విషయాసక్తి మున్నగు వాసనలు దూరమగును. ప్రవృత్తి లేనప్పుడు దానివలన కలిగెడి జన్మకూడ తొలగిపోవును. జన్మము లేనందున సర్వదుఃఖములు సంపూర్ణముగా లేకుండపోవును. ఇట్లు జీవునియందు విజ్ఞానము, శుద్ధియు కలిగి జీవునకు స్వరూపప్రతిష్ఠ కలుగును. శుద్ధస్వరూపుడగు పరమేశ్వరునకును జీవునకును అపుడు వ్యత్యాసము ఉండదు. కావున ఆ జీవుడు పరమాత్మతో కలసినిత్యానందమయుడగును. ఆ స్థితిని కైవల్యము, మోక్షమందురు. కావున మానవుడు జగత్తు మిథ్యయని తెలిసికొని సమస్తములైన కోర్కెలను సంకల్పములను నశింపజేసికొని తన సత్యస్వరూప స్వభావములను జ్ఞానమువలన నెరిగి శుద్ధాత్మ స్వరూపుడై పరమాత్మునియందు గలియుటయే మోక్షమని తెలియుచున్నది. ఇట్లు మోక్షమునందుటయే జనన మరణ చక్రము నుండి విడివడుటకు మార్గము. ఒక్కమాటలో చెప్పవలయునన్నచో మానవుడు ఈప్రపంచమునందు తనకున్న అస్తిత్వభావమును సంపూర్ణముగా నశింపజేసికొని దైవముతో కూడుటయే మోక్షము. కావున మానవుని జననమరణ చక్రమునుండి తప్పించి ఆతనికి ముక్తిని ప్రసాదింపగలిగినది దైవము.

దైవము

17) దైవమనగా నేమి ?

అనంతము అచింత్యము అనిర్వాచనీయమునగు దైవ తత్వమును మాటలతో తెల్పుట అసాధ్యము. దైవము కేవలము అనుభవైకవేద్యము. అయినను ఆవశ్యకత ననుసరించి ఆ తత్వమును గూర్చి అత్యంత సంక్షిప్తముగా వివరింప ప్రయత్నము చేయుచున్నాను. ప్రాజ్ఞులు ఇందలి పరమార్థమును గ్రహింపగలరని నమ్ముచున్నాను. సర్వజగత్ సృష్టి, స్థితి, లయములకు మూలకారణమైనది దైవము. ఆ దైవమును గూర్చి మహామహులైన కొందరు ప్రకటించిన అభిప్రాయములను ముందు గమనింపుడు.

సృష్టి స్థితిలయముల కాధారమై యెట్టి పరిణామమును చెందని చైతన్యశక్తియే దైవము. మృత్యు మధ్యమున యమరత్వము, అంధకారమున అంతర్జ్యోతి, అనంతదుఃఖ మధ్యమున అనంతానుభవమే దైవము. [మహాత్మాగాంధీ]

(1) ఒకటి దేవుడు. (0) సున్న జీవుడు. సున్నకు విలువ సంఖ్య యున్నప్పుడే సముద్రము అలలకాధారమైనటుల ఈ సుగుణ ప్రపంచమునకు మన కాధారమైన అనంత చిదాకాశమే దేవుడు. [రామకృష్ణ పరమహంస]

ప్రతి జీవియందును అనంత దైవశక్తి యున్నది. తన పురుష ప్రయత్నమువలన తన్ను తానుద్ధరించుకొను పురుష ప్రయత్నమే దైవము. [స్వామి వివేకానంద]

అన్నింటిలోను దేవుని దర్శించుట, విశ్వమంతయు దేవుని స్వరూపమనియు, అదియే తన స్వరూపమనియు తెలిసికొనుట దైవము. [స్వామి రామతీర్థ]

తాను - విశ్వము - దైవము వేరుకాదని తన్ను తా నెరుగుటయే దైవము. [రమణ మహర్షి]

కులమును చూచుట అజ్ఞానదృష్టి; గుణమును చూచుట జ్ఞానదృష్టి; విశ్వమంతయు భగవంతునిగా జూచుట విజ్ఞానదృష్టి ఆ దృష్టియే దైవము. [మళయాళ స్వామిజీ]

ఈశ్వరుడు, బ్రహ్మ, పరమాత్మ మున్నగు నామములు గలవాడు, సచ్చిదానందాది లక్షణయుక్తుడు, సర్వవ్యాపకుడు, అజన్మానంతుడు, సర్వశక్తిమంతుడు, దయాళువు, న్యాయకారి, సకల సృష్టికర్త, ధర్త, హర్త, కర్మానుసారముగ సత్యన్యాయములతో జీవులకు ఫలప్రదాత, మొదలగు లక్షణయుక్తుడు పరమేశ్వరుడని నమ్ముచున్నాను.

[మహర్షి స్వామి దయానంద సరస్వతి]

పైన ఒసగబడిన అభిప్రాయములన్నిటిని పరికించిన మీదట దైవమనునది సచ్చిదానందాది లక్షణయుక్తుడై

అనంతజ్ఞానరాశియై ఆదిమధ్యాంత రహితమై సకల చరాచర సృష్టి, స్థితి, లయకారకమై నిర్గుణమై సగుణమై జీవులకు కర్మ ఫల ప్రదాయకమై యుండు విశుద్ధ మహాచైతన్యమని సంక్షిప్తముగ తెలియనగును. అయిన ఈ దైవము పురుషుడా స్త్రీయా, లేక నపుంసకత్వమా అను ప్రశ్న ఉదయించును. వేదాది సత్యగ్రంథములందు దైవము స్త్రీ, పుం,నపుంసకములగు మూడు లింగముల నామములతో తెలుపబడినది. "బ్రహ్మేచితి రేశ్వరశ్చేతి" దేవశబ్దము బ్రహ్మ శబ్దమునకు పర్యాయశబ్దమైనచో దైవము అనియు, ఈశ్వరశబ్దమునకు పర్యాయపదమైనచో దేవుడు అనియు, చితిశబ్దమునకు పర్యాయపదమైనచో దేవీ అనియు వ్యవహరింపబడినది. అంతేకాని దైవము పురుష రూపముగాదు, స్త్రీరూపముగాదు, షండరూపముగాదు. అది సకలము నిష్కళంకము సగుణము నిర్గుణము. దైవము విశ్వమయము. విశ్వోత్తీర్ణము.

18. దైవము నిర్గుణముగా, సగుణముగా, రెండు విధములుగా ఎట్లగుచున్నది ?

ఈ విషయమును తెలిసికొనుటకు ముందు సృష్టి విషయమును గూడ ఒకింత తెలిసికొనవలయును. సృష్ట్యాదిస్థితిని గురించి వేదములందున్న విషయములను గమనింపుడు.

మంత్రము :

"తమ, ఆసీ త్తమ సాగూఢమగ్రే। ప్రకేతం సవిలం।సర్వమాఇదమ్।
తుచ్ఛేనాభ్యపిహితం యదాసీ త్తప స్తన్మహినాజాయతైకమ్ ॥
(ఋగ్వేద మం౧౦; సూ ౧౨౯, మం. 3)

తా॥ [ఈసృష్టి అంతయు, జగత్తునకు పూర్వము అంధకారముచే నావృతమై, రాత్రిరూపమున, తెలియుటకయోగ్యమై, మరియు ఆకాశరూపమున తుచ్ఛమై, అనంత మహాచైతన్యము నందొకచో నాచ్ఛాదితమై యుండెను. పిమ్మట సంకల్పసిద్ధమైన ఆ చైతన్యముచేత కారణరూపము నుండి కార్యరూపమున ప్రకటమయ్యెను.]

పై విషయమును పరికించినచో, సృష్టికి పూర్వము దైవమగు మహాచైతన్యము నిర్గుణముగ, నిరాకారముగ, సర్వవ్యాపకముగ నుండినట్లు తెలియనగును. అట్లు నివృత్తి ముఖముగనున్న మహాచైతన్యమే సచ్చిదానంద పరబ్రహ్మ మన బడినది. సృష్టి జరిగినపుడు ఆ సచ్చిదానంద పరబ్రహ్మమే ప్రవృత్తి ముఖముగనుండి నామరూపమయమగు ప్రకృతి యందు గోచరించుచు పరాప్రకృతియని పిలువబడుచున్నది. నానారూప మయమగు సృష్టి ఏదియైనను, అది అంతయు పరా ప్రకృతి విలాసము. నామరూప జగమందలి చేతన విలాస మంతయు పరబ్రహ్మ స్వభావము. పరాప్రకృతియు పరబ్రహ్మము ఒక్కటియే. కావున ఈ అఖండ విశ్వమంతయు పరమాత్మ

యొక్క మహావిలాసమే. ఈ జగత్తంతయును అనంతశక్తుల విజృంభణము.

దైవమగు ఈ పరబ్రహ్మము రెండువిధములుగా భాసించుచున్నది. ఒకటి నిర్గుణపరబ్రహ్మము. రెండు సగుణ పరబ్రహ్మము.

నిర్గుణపరబ్రహ్మము స్థావర జంగమాత్మకమగు సర్వ జగత్తునకాత్మ. అదియే దైవసాక్షాత్కార కారణము. అదియే దైవము. ఆ పరబ్రహ్మమే జీవుని మాయనుండి తొలగించి విముక్తుని జేయును. పరమాత్మ విశ్వరూపియేగాని విశ్వమే పరమాత్మ రూపముగాదు. పరమాత్మ విశ్వోత్తీర్ణమైనది. విశ్వమునే పూర్తిగా ఎరుగజాలని మానవుని విజ్ఞానము. విశ్వోత్తీర్ణమైన పరమాత్మకు రూపమును నిర్ణయించుట అసాధ్యము. పరమాత్మ పరంజ్యోతి స్వరూపము. సూర్యునిలోనున్న వరేణ్య తేజమును ఉపాసింతుమని గాయత్రీ పరమార్థము. సూర్యునిలోనున్న ఆ తేజము బాహిరమై ప్రపంచవస్తువుల భాసింపజేయు కార్య తేజము కాదు. సూర్యుడుకూడ ప్రకాశించుటకు హేతువైన మహాతేజస్సు. "తస్యభాసా సర్వమిదాం విభాతి" అని శ్రుతి బోధించుచున్న మహాతేజమే యీ తేజము. కావున పరమాత్మ తేజస్సునకు తేజస్సు, చక్షునకు చక్షువు, మనస్సునకు మనస్సు, అది మహాజ్యోతి. దాని కాంతిలేశము కలిగి సూర్యాదులు ప్రకాశింతురు. పరమాత్మ నిత్యము అభి

వ్యాప్తము. అన్నియు దానియందున్నవి. అన్నిటియందు అది యున్నది. అన్ని రూపములు దానియందున్నవి. అన్నిరూపములయందు అదియున్నది. వ్యావహారిక సర్వభేదములును కారణమునందు విలీనమగునపుడు సర్వజగత్కారణమగు పరమాత్మ నిర్గుణ రూపమున అవస్థితమగును. అట ఎట్టిభేదములును భాసింపవు.

నిర్గుణ పరమాత్మ సగుణ రూపముగా రూపొందినపుడు స్పష్టరూపమున అన్నియు గోచరములగును.

దృశ్యరూపమగు సమస్తవిశ్వము పరమాత్మయొక్క సగుణ శక్తి కార్యము. ఈ సగుణశక్తి సత్వరజోతమోగుణముల సామ్యావస్తురూపము. ఈ త్రిగుణకార్యములు సుఖదుఃఖ మోహములు. విశ్వపదార్థములన్నియు యీ మూడుగుణములు కలిగియుండును. సగుణపరమాత్మ విశ్వమున కార్యరూపమున నున్నది. కావున కార్యరూపమే పరమాత్మ రూపముగా భావింపవలయును. అంతేగాని సర్వచరాచర జగత్తునకు ఆత్మయు కారణమునగు పరమాత్మను నేత్రములతో గ్రహించుటకు నియమితమైన రూపము నిర్ణయింపబడజాలదు. కావున అనేక కార్యముల రూపమునయున్న సగుణపరమాత్మయొక్క కర్మల గుణస్వభావముల ననుసరించి ఆ పరమాత్మకు అనేక నామములు రూపములు ఏర్పడినవి. పురుష రూపమున యీ సగుణపరబ్రహ్మను భావించినపుడు బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు

గాను, స్త్రీ రూపమున భావించినపుడు, మహాసరస్వతి, మహాలక్ష్మి, మహాకాళీ స్వరూపులుగా సంభావిత మగుచుండును. ఇట్లనేక రూపములు అనేక నామములు దైవమునకు ఏర్పడు చున్నవి. వీరికి ఆకారములు ఆయుధములు, ఆభరణములు, ఆవాసములు, వాహనములు మున్నగు లక్షణములన్నియు ఏర్పడుచున్నవి. ఈ ఆకార ప్రకారములలో పరమాత్మయొక్క ఆయా కార్యముల తత్వ రహస్యము లిమిడియుండును. ప్రాజ్ఞులు ఆ రహస్యమును ఎరిగి అనేకత్వమునయున్న ఏకత్వమును దర్శింతురు. ఇట్లు పరమాత్మ సగుణ నిర్గుణ రూపముల ప్రవర్తిల్లు చున్నది.

19. అట్టి పరమాత్మను పొందుటకు మార్గమేమి ?

పరమాత్మను పొందుటకు అనేక మార్గములున్నవి. వానిలో కర్మ, యోగము. భక్తి, జ్ఞానము అను నాల్గును ప్రధానమార్గములని పెద్దలు సూచించిరి.

--౦--

యోగ మార్గములు

20. కర్మ అనగా నేమి ?

కర్మను గురించి వేదములలో చెప్పబడియున్నది. వేదములను మూడు భాగములుగా విభజించిరి. మొదటిది 'కర్మ కాండ'. ఈకాండ యజ్ఞయాగాది రూపమైన వేదములందు తెలుపబడిన యజ్ఞ కర్మలు మాత్రమే కాక మానవుడు తన జీవితమునందు ఆచరించు ప్రతిపనియు కర్మమనియే యనబడును. మనుజుడు స్వార్థబుద్ధితో తనకొరకై చేయుపనులు ఆతనిని బంధించి ఆతని ఉత్తర జన్మమునకు కారణములగుచున్నవి. అటుగాక ఆతడు దైవార్పణ బుద్ధితో లోకహితార్థమై పనులు ఆచరించినచో ఆకర్మలు వానిని బంధించవు. వాని వలన అతనికి మరుజన్మము కలుగదు. లోకహితార్థమై చేయబడు ప్రతి పనియు యజ్ఞమగుననియు కావున మనుజుడు ఫలాపేక్షరహితముగ భగవదర్పణ బుద్ధితో సర్వకార్యములు చేయుచుండ వలయుననియు యిట్లు నిష్కామముగా కర్మల నాచరించుటయే కర్మయోగ మనబడుననియు శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతయందు తెలిపియున్నారు.

'కర్మ' యోగములలో ప్రధానమైనది. ఇట్టి కర్మయోగము వలన మానవునకు చిత్తశుద్ధి గలిగి, బుద్ధి ప్రాకృత విషయములలో మునిగిపోక, యీ సంకుచిత విషయ దృష్టి

నుండి బయల్పడి నిష్కలుషమైన భక్తిమార్గము లోనికి పోవును. ఇది సర్వమానవులకు ఆచరణయోగ్యముగా సులభముగా నుండును. ఫలాపేక్షను వదలిచేయు ఈ నిష్కామ కర్మయోగమువలన మోక్షమును పొందవచ్చును. ఇట్టి కర్మ యోగమే జన్మరాహిత్య స్థితిని బోధించుచున్నది.

21. యోగమనగా నేమి ?

యోగమనగా కలయిక లేక కూడిక. ఆత్మ పరమాత్మల కలయికనే యోగమందురు. పూర్వకాలమున పతంజలి మహర్షి యిట్టి కలయికను తెల్పు 'యోగసూత్ర' మను ఒక గ్రంథమును వ్రాసియున్నారు. యోగమునకు ఉపయుక్తములైన భక్తి, జ్ఞానవైరాగ్యములకు సాధనములైన లక్షణములన్నిటిని క్రోడీకరించి ఎనిమిది సోపానములుగా చెప్పియున్నారు. దీనినే అష్టాంగ యోగమని అందుము.

22. అష్టాంగ యోగమనగా నేమి ?

అష్టాంగయోగమనగా 1) యమము 2) నియమము 3) ఆసనము 4) ప్రాణాయామము 5) ప్రత్యాహారము 6) ధ్యానము 7) ధారణము 8) సమాధి అను ఎనిమిది లక్షణముల కలయిక. వీనిని వివరముగా చెప్పవలయుననిన ఒక్కొక్క దానిని గూర్చి ఒక్కొక్క గ్రంథమగును. కనుక సంక్షిప్తముగా తెల్పుటకు ప్రయత్నింతును. ఇందులో మొదటిదైన 'యమము'ను గూర్చి తెలిసికొందము.

'యమము' అనగా ఈ ఆధ్యాత్మ విద్యకు ప్రాణము వంటిది. ఆధ్యాత్మిక గ్రంథములన్నిటికిని ముఖ్యమైన పునాది వంటిది. దీనియందు ఐదు అంతర్భాగములు ఉన్నవి. వీనిని త్రికరణ (మనోవాక్కాయ) శుద్ధిగా అనుష్ఠింపవలయును. మనము ఏపనినైనను చేయవలయుననిన ముందుగా ఆలోచింతుదుము. ఇట్టి ఆలోచన రూపమైన కర్మనే మానసికకర్మ అనియు అందుము. ఆలోచించి దానిని మరియొకరితో సలహాకో, న్యాయముకొరకో చెప్పుదుము. ఇట్టి దానిని వాచికకర్మ యనియు అందుము ఇట్లు ఆలోచించిన దానిని శరీరముతో చేయుదుము. ఇట్టి దానిని కాయికకర్మయని అందుము. ఏ మంచిపనినైనను మనము త్రికరణ శుద్ధిగా చేయవలయును. మంచి విషయములైతే వృద్ధి పొందవలయును.

'యమము' నందు అయిదు అంతర్భాగములు ఉన్నవని మొదటలో చెప్పుకొనియుంటిమి. అవి 1) అహింస 2) సత్యము 3) అస్తేయము 4) బ్రహ్మచర్యము 5) అపరిగ్రహము.

'అహింస' అనగా ఏ జీవికైనను మనోవాక్కాయము లచే కష్టము కలిగింపకుండ నుండుటయేయనియు, తనయొక్క నిజస్వరూపము తెలిసికొనుటయే ననియు పెద్దలు నుడివియున్నారు.

'సత్యము' అనగా వేదములందు, కర్మకాండములందు విధి వాక్యములందు మిక్కిలి ముఖ్యమై యున్నది. ఈ పదమే సత్యము, జ్ఞానము, అనంతము, బ్రహ్మము అని వచ్చుచున్నది. అబద్ధము చెప్పకుండుటయే దీని అర్థము. ఆడినమాట తప్ప కుండుటనే సత్యమని యందుము. దీనిని సాధింపవలయునన్న ఎంతత్యాగము నైనను చేయవలసియున్నది.

అస్తేయము అనగా దొంగతనము చేయకుండుట. దీనిని సాధింపవలయునన్న పూర్తిగా తృష్ణ నశించి పోవలయును. ఆనందమును అనుభవింపవలయునన్నచో ప్రపంచ విషయము లలో తృప్తి యుండవలయును. అపుడు మనకు ఏచోరత్వ దోషమును అంటదు. దీనినే అస్తేయమని యందుము.

మానవ జీవితమును నాల్గు ఆశ్రమములుగా నుండునట్లు పెద్దలు విభజించిరి. అందు మొదటిది బ్రహ్మచర్యాశ్రమము. మనుష్యుని జీవిత సాఫల్యమంతయు నీ ఆశ్రమముపై ఆధార పడియుండును. ఉపనయన సంస్కారము కలిగిన తదుపరి విద్యా భ్యాసమునకై అనగా ఆధ్యాత్మికజ్ఞానమును పొందుటకై మానవుడు ఈ ఆశ్రమమున ప్రవేశించును. బ్రహ్మచారికి ముఖ్యముగా శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమా ధానములను ఆరులక్షణము లుండవలయును. అట్టి బ్రహ్మ చారికి పరబ్రహ్మమును పొందు ఆధ్యాత్మిక పరిజ్ఞానము సులభ సాధ్యమగును. బ్రహ్మచర్యము కేవలము అవివాహితునికే

గాక, గృహస్తునకుగూడ ఆచరింపదగినది. బ్రహ్మచర్య వ్రతమును ఆచరించువాడు మాత్రమే బ్రహ్మమును పొందుటకు తగిన శక్తి బలము పటుత్వములను పొందగలడు. ఈ బ్రహ్మచర్యమునే సాధనసంపత్తి యనవచ్చును. సామాన్యార్థమున బ్రహ్మచర్యమనగా కామినీ కాంచనములకు దూరముగా నుండుట. ఇదిఆధ్యాత్మికాభివృద్ధికి మూలాధారము.

23) నియమము అనగానేమి ?

యమమునకువలెనె నియమమునకును ఐదు అంతర్భాగములున్నవి. అవి 1) శౌచము 2) సంతోషము 3) తపస్సు 4) స్వాధ్యాయనము 5) ఈశ్వరప్రణిధానము.

24) శౌచము అనగానేమి ?

శౌచము అనగా పరిశుభ్రత. శుచి అనియు దీనినందురు. అంతఃశౌచము, దేహశౌచము, వస్త్రశౌచము, గృహశౌచము, పరిసరశౌచము అనబడు పలువిధములైన శౌచములను మనము క్షుణ్ణముగా పాటించునప్పుడే సాధన సక్రమముగా మనకు సాగిపోవును. కావున శౌచము సాధనకు ఎంతయో ఉపకారి యగుచున్నది.

25) సంతోష మనగానేమి ?

సంతోషమనగా సుఖము. ఎప్పుడు విషయసుఖములలో మునిగియుండుట యేనా ? యను ప్రశ్న ఉదయించును. సంతోషము అదికాదు. మనము అనుకొనుచున్న సుఖము సంతోష

ములవలె సున్నితమైనటువంటిదికాదు. ఇందులో మార్దవము ఉన్నది. సుఖము అనగా ఈ లోకసంబంధ విషయముల వలన కలుగు ఆనందమువంటి తృప్తి. ఈ తృప్తిని పొంద కున్నచో దుఃఖము అందుము. ఇట్టి సుఖదుఃఖములు ప్రపంచ విషయములపై ఆధారపడి యుండును. ఈ సుఖదుఃఖములకు అతీతమై అన్యముగనుండు స్థితియే నిజమైన సంతోషము. ఈ సంతోషమును అనుభవించువానికి శరీరము మంచి తేజస్సు గలిగియుండును. ముఖములో కాంతి వెలుగుచుండును. నేత్ర ములు కళకళలాడుచు ఒక మెరుపును కలిగియుండును. దీనిని మానసికముగా పొందినచో సత్వబుద్ధి పెంపొందును. శాంతము తాండవించును. మాటలు మృదు మధురత్వమును కలిగి యుండును. దీనివలన కామక్రోధాదులు సడలిపోవును. ఎల్ల ప్పుడు మందహాసముతో నుండుట దీనియొక్క ప్రధాన లక్ష ణము. పెద్ద వెకిలినవ్వు పనికిరాదు. ఇంగ్లీషులో సామెతఒకటి యున్నది. "A loud laugh denotes a vacant mind" పెద్ద నవ్వు ఖాళీచిత్తమును సూచించును— అని దీనిభావము. ఈ సంతోష విషయము సులభముగా అందరికిని తెలియునదై యుండుటచే ఇది అత్యంత ముఖ్యమైనది.

26) తపస్సు అనగానేమి ?

తపస్సు అనగా అనేక నిర్వచనములు పెద్దలు చెప్పి యున్నారు. తీవ్రముగా గ్రంథమును చదువుట, ధ్యానము

చేయుట, జపముచేయుట, నియమయుక్తముగా జీవనము చేయుట, బ్రహ్మచర్యము మొదలగు విషయములన్నింటిని తపస్సు అనియే అందుము. అంతేగాక బుద్ధిని ఏకాగ్రతతో ఒకచోట నిలిపి చేయు ఏపనినైనను తపస్సు అనియే చెప్పనగును. ఇట్టిది కామ్యముచేత చేసినను, నిష్కామ్యముగా చేసినను తపస్సే యగును తపస్సు అను లక్షణమే లేకపోయినచో ఆధ్యాత్మిక విషయములన్నియు కుంటుపడిపోవును. ఈ తపస్సు ఏ ఫలితమునైనను ఇచ్చుటకు కామధేనువు వంటిది.

27) స్వాధ్యాయము అనగానేమి ?

స్వాధ్యాయము అనగా వేదాధ్యయనము. వేదములను చదువవలయునన్నచో పైనచెప్పబడిన తపస్సు ఉండవలయును. వేదాధ్యయనమువలన భగవద్భక్తి మిక్కుటముగా కలుగును. క్రియాయోగమున చివరరాబోవు ఈశ్వర ప్రణిధానమునకు ఉపయోగించు ఏ క్రియనైనను స్వాధ్యాయము అనియే యనవచ్చును. కావున భక్తిని కలిగించు పుణ్యచరిత్రములు మున్నగు వాని పఠనము కూడ స్వాధ్యాయమనబడుచున్నది.

28. ఈశ్వర ప్రణిదాన మనగానేమి ?

ఈశ్వరుడు సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు, అనంత జ్ఞానరూపుడు, ఆదిమధ్యాంత రహితుడు, సృష్టిస్థితిలయ కారకుడని ఆ దైవముయొక్క లక్షణములను గ్రహించినచో ఆ దైవ

ముపై మనకు భక్తి కలుగును. ఇట్లు భగవంతుని గొప్పదనమును గ్రహించి ఆతనియందు మన చిత్తమును లగ్నము చేయుటకై భక్తితో చేయు ప్రయత్నమే ఈశ్వర ప్రణిధానమనబడుచున్నది.

29. ఆసనమనగా నేమి ?

దేహమున నొప్పి తిమ్మిరి మున్నగు ఎట్టి బాధలును కలుగకుండ ఎక్కువకాలము కూర్చొనగలిగిన పద్ధతిని ఆసనము అందురు. అందువలననే పతంజలిమహర్షి యీ ఆసనముయొక్క నిర్వచన మిచ్చుచు "స్థిరసుఖమితి ఆసనం" అని, అనినారు. మనము సుఖముగ ధ్యానము చేసికొనుటకు ఉపయుక్తముగా కూర్చొను ఏ విధానమైనను అది ధ్యానాసనమని అనబడును. ఈ ఆసనములకు వెన్నెముక మిక్కిలి ముఖ్యము. వెన్నెముకను నిటారుగా నుంచవలయును. కాని ప్రయత్నపూర్వకముగ దీనిని బిగించి నిలిపినచో బాధకలుగును. కనుక బిగించి నిలుపుట పనికిరాదు. నడుమును ఏమాత్రము నడ్డిగా నుంచినను కొంచెము సేపులోనె నొప్పి ప్రారంభమగును. కావున మెడను వెన్నెముకను బిగింపు లేక సులువుగా నిలువుగా నుంచుట ఆసనములందు ప్రధానము ప్రథమమునైన సూత్రము. ఇక కాళ్లు పెట్టుటయందు అనేక మార్పులు కలుగును. ఈ మార్పులననుసరించి ఆసనములకు అనేక నామములు కలుగుచున్నవి. శీర్షాసనము, పద్మాసనము, మయూరాసనము మున్నగు ఎన్నియో ఆసన

ములున్నవి. వానియందు పద్మాసన శీర్షాసనాదులు మిక్కిలి ముఖ్యములైనవి.

30. ప్రాణాయామము అనగానేమి ?

వ్యక్తి ఆసనశుద్ధిగా కూర్చొని కుడిచేతితో ముక్కును పట్టుకొని బొటనవ్రేలిని కుడిముక్కుమీద ఉంగరపువ్రేలిని ఎడమముక్కుమీదను నుంచవలయును. తదుపరి బొటనవ్రేలితో కుడి ముక్కును నొక్కియుంచి ఎడమ ముక్కుద్వార గాలిని పూర్తిగా పీల్చవలయును. పీల్చిన గాలిని కొంచెముసేపు ఊపిరి తిత్తులలో నుంచవలయును. అట్లు గాలిని నిలిపి యుంచునపుడు ఎడమముక్కును గూడ వుంగరము వ్రేలితో నొక్కి మూయ వలయును. పీల్చిన గాలిని గొంతుపైకి రానివ్వకూడదు. తరు వాత కుడి ముక్కును మెల్లగా వదులుచేయుచు చాలనెమ్మ దిగా గాలిని బయటకు వదలివేయవలయును. ఇట్లు గాలిని పీల్చుటను పూరకమనియు పీల్చిన గాలిని లోపల నిలుపుటను కుంభకమనియు తిరిగి ఆ గాలిని వదలివేయుటను రేచకము అని యందురు. పూరక కుంభక రేచకములను యీ మూడిం టిని కలిపి ఒక ప్రాణాయామము అని యందురు. ఈ ప్రాణా యామ మొనర్చు సమయమున కొంచమైనను శ్రమ యుండ రాదు. ఇట్లు సాధ్యమైనంత ఎక్కువ కాలము ప్రాణాయామము లొనర్చుటకు సాధన చేయవలయును. ప్రాణాయామము వలన రక్తశుద్ధియు, నాడీశుద్ధియు కలిగి ధ్యాననిమగ్నతకు ఎక్కువ

అవకాశ మేర్పడును. దేహమున తేజస్సు కలుగును. కంఠ స్వరము మృదువగును. నేత్రదృష్టి బాగుగనుండును. జ్ఞాపక శక్తి పెరుగునుకాని యీ ప్రాణాయామము నభ్యసించు చున్నంతకాలము వ్యక్తి బ్రహ్మచర్యమును యమ నియమము లను తప్పక పాటింపవలయును. ఈ ప్రాణాయామముచే అష్ట సిద్ధులు అనేక మహత్తులు సంకల్పసిద్ధులు పూర్తిగ కలుగును. ఇది మిక్కిలి జాగరూకతతో అనుభవజ్ఞుల మార్గదర్శనముతో చేయవగినదిగాని పుస్తకములందు చదివి దీని నభ్యసింప ప్రయత్నించినచో కొంత ప్రమాదముకూడ కలుగవచ్చును.

31. ప్రత్యాహారము అనగానేమి ?

ఆధ్యాత్మికాభివృద్ధికి యమ నియమముల ద్వార మన బాహ్య ప్రవర్తమును పవిత్రము చేసికొనిన పిదప ఆధ్యాత్మి కానుభవరాసిని పొందుటకు ధ్యానమునకు ముందువచ్చు ఆలోచ నలను అరికట్టుట యను ప్రక్రియనే ప్రత్యాహారమనియందురు. ఇది ఎటులన పొలములో విత్తనములు చల్లబోవుముందు పొల ములో గల కలుపు మొక్కలను తీసిపారవేసి, ఆ క్షేత్రమును శుభ్రముచేసి, ఏ ఆటంకములును లేకుండ యితరమైనటువంటి భావములను తీసివేసి యుంచుటనే ప్రత్యాహారము అని యందురు. దీనినిగూర్చి అరవిందులు ఒక చక్కని ఉపమాన ములో వివరించియున్నాడు. పరికింపుడు ! ఒక చెరువునకుఅలలు వచ్చుచుండును. ఈ అలల కెరటములు గాలి వీచుచున్నందు

వలన వచ్చుచుండును. మన చిత్తముకూడ ఈ చెరువువంటిదే. భావములు కెరటములవంటివి. ప్రపంచములో గల విషయ వాంఛలు అనగా లౌకిక సుఖములు వానిని గూర్చిన అపేక్షలే గాలి యనుకొనుము. చెరువునకు గాలి లేకున్నచో అలలును కెరటములును లేకుండ ఆ చెరువు నిర్మలముగా ప్రశాంతముగా నుండును. ఆ విధముననే మన చిత్తములో లౌకిక సుఖములకు తావివ్వనియెడల మనస్సు ప్రశాంతముగ నుండును. మనస్సులో ఈ లౌకిక సుఖములకు తావివ్వకుండుటయే ప్రత్యాహారమని యందుము. ఇది ఎంతకష్టమో ఆలోచింపుడు ! చెరువుమీదికి గాలిని రాకుండ చేయుట ఎంతకష్టమో మనస్సులోనికి ప్రపంచ విషయములను ఈ లౌకిక భావములను రానివ్వకుండుటఅంత కష్టము. ఇట్టి కష్టసాధ్యమైన ప్రత్యాహారమును జయించిన యెడల ఆధ్యాత్మికానుభవరాసిని చూడగలుగుదుము.

32. ధ్యానమనగా నేమి ?

ధ్యానమునకు పునాది ప్రత్యాహారము. ప్రత్యాహారము తెలియకపోయినచో ధ్యానమే లేదు. ఇట్టి ప్రత్యాహారములకు యమ నియమములు ముఖ్యమైనవి. అభ్యాస వైరాగ్యములచే ప్రత్యాహారము పొందినచో ధ్యానము కుదురును. ఇట్టిధ్యానము కోసము ఎంతయో కష్టపడవలయును. త్యాగము చేయవల యును. ఇది ఆధ్యాత్మికానుభూతిని గలిగించును. ఈ అను భూతి జన్మజన్మలకు మనవెంట వచ్చుచున్నది. ఇదియే జన్మ

రాహిత్యమును ప్రసాదించి ఆనందసాగరమున ముంచివేయును. మన నేత్రములకు కనిపించు అమిత ఆకర్షణీయములైన యీ ప్రపంచ సుఖములన్నింటిని త్యజింపవలయును. అపుడే మనకు ధ్యానము కుదురును. పొలములో కలుపు తీసిన తదుపరి సాగు చేయబడిన చేనులో విత్తనములను వేయుటనే ధ్యేయము అని యందుము. అటులనే ధ్యానములోనుండు ధ్యేయవస్తువు పరమాత్మ.

33. పరమాత్మను ఎట్లు ధ్యానింపవలయును ?

పరమాత్మను ధ్యానింపవలయునన్న ఉపనిషత్తులనుండి పరమాత్మయొక్క విషయములను తెలిసికొనవలయును. వీనిని విమర్శనాదృష్టితో పరికించినపుడు పరమాత్మ శబ్ద స్పర్శరూప రసగంధములేని నిర్గుణ నిరాకార తత్వమని తెలియును. అట్టి పరమాత్మను ధ్యానించుట ఎట్లు సాధ్యమని మనస్సు సంకోచించును. ఆ పరమాత్మ పురాణములందు పురుషుడుగా నున్నట్లు చెప్పబడియున్నది. పురాణ పురుషుడుగా నుండు ఆ ఈశ్వరుని మరల మూడుభాగములు గావించి బ్రహ్మ విష్ణు మహేశ్వరులని పేర్లుపెట్టిరి. వీరినుండి ముప్పదిమూడు కోట్ల దేవతలు ఏర్పడియున్నారు. వీరికి రూపములు, నామములు, వాహనములు నివాసములు ఏర్పడియున్నవి. కాని అసంఖ్యాకులైన యీ దేవతలలో ఎవరిమీద ధ్యానమునిలుపవలయునను ప్రశ్న యుదయించును. ఒకవ్యక్తి తన యిష్టము

ననుసరించి ఏదియో ఒక దేవతను తన ధ్యానమునకు ధ్యేయముగా ఎన్నుకొనును. వాని యిష్టము వాని సంస్కారముపై ఆధారపడి యుండును తమోగుణము ప్రధానముగ నుండు సాధకుడు కాళికాదేవి, పోలేరమ్మ, అంకాలమ్మ మున్నగు దేవతలను ధ్యేయవస్తువుగా చేసికొనును. అటుగాక సాధకుడు రజోగుణ ప్రధానుడయినచో వానికి వీరభద్రస్వామి, ఉగ్రనరసింహస్వామి, మున్నగు దేవతలు ధ్యేయ వస్తువులగుదురు. సత్వగుణ ప్రధానుడగు సాధకునకు సత్వగుణమూర్తులగు రాముడు, కృష్ణుడు, అన్నపూర్ణ, శ్రీ వాసవికన్యకాపరమేశ్వరి మొదలగువారు ధ్యేయవస్తువు లగుదురు.

సత్వగుణమూర్తులైన దేవతలను ధ్యేయములుగా పెట్టుకొనుటయే ఉత్తమమైనది. మనము ఎక్కువగా ప్రేమించు దేవత రూపమును ధ్యానసమయమున మన దృష్టిలో నుంచుకొనుటయే రూపధ్యానమనబడును. ఆ దేవతయొక్క నామమును మొదట బిగ్గరగా ఉచ్చరించుచు తరువాత నెమ్మదిగా పలుకుచు అటుపై మనస్సులోనే నిలుపుటను నామధ్యానమని యందురు. అటులనే భగవానుని గుణములను, మహాత్తర కార్యములను స్తుతించుట, ప్రార్థించుట, మనస్సులో నిలుపుకొనుటయే భావధ్యానమనబడును. ఈ విధముగ భావనామరూపధ్యానములను ప్రత్యాహారముచే పరిశుభ్రము గావింపబడిన నిర్మల మానసముతో చేయుటయే ధ్యానము అని తెలియనగును.

34. ధారణము అనగానేమి ?

ధ్యానమాధుర్యమును చవిజూచి ప్రయత్న పూర్వకముగ శ్రమించి తన యిష్టదేవతామూర్తిని ధ్యానమునకన్న హెచ్చుగా తనదృష్టిలో నిలుపుకొనుటనే ధారణము అని యందుము.

ధారణమునకన్న ఏడురెట్లు హెచ్చుకాలము మనస్సున తన యిష్టదేవతామూర్తిని నిలుపుకొనినచో దానిని సమాధి యని యందుము. కన్నుమూసినను కన్నుతెరచినను తనయిష్ట దైవమే గోచరించు స్థితియే సమాధి స్థితియని తెలియవలయును. ఈ సమాధులలో అనేక రకములున్నవి. ధ్యానము నందుండు దైవముయొక్క రూపముమీదనే బుద్ధి నిలచినచో అట్టి సమాధిని "భావ" సమాధి యందురు. అటుగాక గుణము మీదనే బుద్ధిని నిలిపినచో దానిని సవికల్ప సమాధి యందురు. ఈ రెండువిధములుగా నామరూప గుణములను దాటి కేవల ఆనందమున మునిగినచో దానిని 'నిర్వికల్ప' సమాధి యందురు. తాను సమాధి స్థితిలో పొందుచున్న ఆనందము ఆతనికి తెలియ కుండినచో అట్టిదానిని 'అసంప్రజ్ఞాత' సమాధి యని యందురు. ఇట్లనేక విధముల సమాధులున్నవి. ఇవి యన్నియు భక్తిని పెంపొందించి వ్యక్తిని ముక్తుని గావించుట కుపకరించును.

—o—

భక్తి మార్గము

36. భక్తి యనగానేమి ?

సర్వచరాచర సృష్టి స్థితిలయకారకుడైన పరమాత్మ యొకడు కలడనియు అతని దర్శన భాగ్యమువలన సర్వపాపములు దుఃఖములు నశించుననియు ఆతని కరుణాకటాక్ష వీక్షణాలేశ ప్రసారముచే ఆనందసాగరమైన మోక్షము లభించుననియు దానితో ఈ జననమరణ ప్రవాహ రూపమైన సంసార దుఃఖము అంతమొందుననియు శాస్త్రపరిచయము వలననో, ఆప్తవాక్యముచేతనో మహాత్ముల అనుభవములను తార్కాణముగ స్వీకరించియో అట్టి మహదానంద ప్రాప్తికై పరితపించుచు ఎంతటి త్యాగమునైనను చేసి ఆ యానందము నందుకొనుటకు సంసిద్ధులమై చేయు అత్యంత తీవ్రప్రయత్నమే భక్తి యనబడును.

మానవుడై పుట్టిన ప్రతివాడును ఈ భక్తిని కలిగి యుండునని చెప్పవచ్చును. ప్రపంచమున గల అన్ని మతములు ఈ భక్తిమార్గమునకు చెందినవియే. జ్ఞాన, కర్మ రాజయోగములు మున్నగు మార్గము లన్నింటికంటె భక్తి యోగము సులభసాధ్యమై అందరికి అందుబాటులో నుండును. సమస్త జీవరాసులయందు ఒక అసాధారణ ప్రేమబంధము విలసిల్లుచుండుట సర్వవిదితము. తల్లిమీద ప్రేమ, బిడ్డమీద ప్రేమ,

భార్యమీద ప్రేమ, యజమానిమీద ప్రేమ, సేవకునిమీద ప్రేమ, బంధువుమీద ప్రేమ, మిత్రునిమీద ప్రేమ, పక్షిమీద ప్రేమ, పశువుమీద ప్రేమ ఇంతెందులకు ఈ లోకమే ప్రేమ స్వరూపమనవచ్చును. ఈ ప్రేమతత్వమునందే భక్తి తత్వము ఇమిడియున్నది. స్వార్థరహితమై ప్రాపంచిక సుఖ దూరమై అనంత త్యాగయుక్తమై ప్రేమ ఎప్పుడు ఒప్పారునో అప్పుడది భక్తి యనబడును. ప్రాపంచిక సంబంధమై మోహముయొక్క ప్రోద్బలముచే ప్రకటింపబడుచున్న ప్రేమ కూడ కొన్ని యెడల గొప్ప త్యాగమును కనపరచును. అట్టి దానిని కూడ భక్తి అనియే నందురు. పతిభక్తి, రాజభక్తి, దేశభక్తి మున్నగునవి యిట్టివేకాని ఈ భక్తి సమాగ్రము సక్రమముకాదు.

జీవుడు తల్లిగర్భమున పిండ రూపమున నున్నప్పుడు ఓ పరమేశ్వరా ! ఈ గర్భనరకమునుండి నన్ను తప్పించమని అలమటించుచు దృష్టిబుద్ధిని భగవంతుని పైననే నిలిపి ఆతనినే ప్రేమించుచుండును. జన్మించిన తరువాత ఆ జీవుడు తనపూర్వ ప్రేమను తలిదండ్రులకు బంధుమిత్రులకు గృహక్షేత్రాదులకు మరియు ఇట్టి అనేక విషయములకు పంచియిచ్చును. ఇట్లు ఛిన్నాభిన్నమైన జీవుని ప్రేమప్రవాహమును వెనుకకు మరల్చి తిరిగి భగవంతుని మీదికి ప్రసరింపజేయుటయే భక్తి యన బడును. ఈ భక్తిముందు తలిదండ్రులు భార్యాబిడ్డలు ప్రపంచ మనునది యేదియును లేదు.

37. అట్టి భక్తిని పొందుటకు మార్గమేమి ?

ప్రపంచమున మానవుడు తన దృష్టిలో కనిపించు చేతనా చేతన పదార్థము లన్నింటియందు అధికములైన ఉత్తమములైన వానినే కోరును ప్రేమించుచుండును. అట్టివానినే స్మరించుచు వానిని పొందుటకే నిరంతరము ప్రయత్నము చేయుచుండును. ఇది మానవసహజమైన లక్షణము. అట్టి యెడ యీ సర్వచరాచర జగత్తు అంతటికంటె అత్యధికుడును, అనంతశక్తి సంపన్నుడును అనంత ఐశ్వర్య విలసితుడును, అనంతానంద స్వరూపుడును, అనంతుడును నైనవాడు భగవంతుడు అని తెలిసిన మానవుడు ఆ భగవంతుని విడచి అతి స్వల్పశక్తులు గలవానిని ప్రేమించలేడు. అయిన యీ భగవంతుని ఆధిక్యతను మానవుడు ఎట్లు గ్రహించగలుగును? ఎపుడు గ్రహించగలుగును ? అను ప్రశ్నలుదయించును. మానవుడు తన వివేకమును పెంపొందించుకొని స్వాధ్యాయముచేత బుద్ధి వికాసమును పొంది ప్రపంచముయొక్క హేయత్వమును క్షణికత్వమును గ్రహింపవలయును. ఈ ప్రపంచములోని ప్రతి వస్తువు అశాశ్వతమే, క్షణికమే, నశ్వరమే, యని నిశ్చయము చేసకొన్నవాడు భగవంతుని ఆధిక్యతను త్వరగా తెలిసికొన గలడు. అట్లు దేవుని ఆధిక్యతను గ్రహించి ఆతనినే ప్రేమించుచు ఈ సర్వలోకానుభవమును దూరము చేసికొనుచు ఆ దైవానుభవమును పూర్ణముగా పొందుటకుచేయు తీవ్ర

ప్రయత్నమే భక్తి యనబడును. ఇట్టి భక్తిని సంపాదించుటకు మిక్కిలి ధైర్యస్థైర్యములు ఘనమైన త్యాగము ధీశక్తి సర్వసద్గుణములు అన్నియు కలిగియుండుట అనివార్యము. ఇవి యన్నియు కలిగిన అసలైన భక్తులు ప్రపంచమున ఎందరున్నారన్నది ఆలోచించుకొనవలసిన విషయము. ప్రపంచము హేయము తుచ్ఛము అని తెలిసికొన్నవాడు ఈ ప్రపంచమును త్రోసిపుచ్చుట జరుగును. అపుడు ఆ మానవుడు భక్తియందు ప్రవేశించినట్లు లేక ఆతనికి భక్తి కుదిరినట్లు భావింపవచ్చును. దీనినే జ్ఞానులు జ్ఞానమార్గమని యందురు. ప్రాపంచిక విషయములను త్యాగము చేయనిదే మనుష్యుడు ఏ మార్గమునందును ప్రవేశించినట్లుకాదు. అందుచే భక్తియనగా త్యాగమనికూడ చెప్పవచ్చును. మనస్సు దేవునిపై లగ్నమగుటయందలి తారతమ్యములనుబట్టి భక్తి అనుష్ఠాన విధానమునకూడ భేదము లేర్పడియున్నవి. వానిని శాస్త్రములు ఐదు విధములుగా పేర్కొన్నవి. అవి 1) శాంతభావము 2) దాస్యభావము 3) సఖ్యభావము 4) వాత్సల్యభావము 5) మధురభావము.

శాంతభావమనగా భగవంతుడు సర్వజగత్ ప్రభువని నమ్మి వ్యక్తి తన ధర్మప్రవర్తనముచేత దేవుని అనుగ్రహము పొందుటకు ప్రయత్నించుట. అట్టివాడు భగవంతుని పట్ల అత్యంతములైన భయభక్తులు కలిగి దేవమూర్తిని సమీ

పించుటకుగూడ నేరముగా భావించుచు దూరదూరమునుండి దేవునకు నమస్కరించుకొనుచు రాజసేవకునివలె ప్రవర్తించుచుండును. దేవాలయములందలి గర్భాలయములలోనికి ఎవ్వరును పోరాదను విధానము ఈ శాంత భావభక్తి ననుసరించియే కలిగినది.

దాస్యభావమనగా భగవానుని తన యజమానిగా భావించి ఆతనికి సర్వసపర్యలు గావించుచు అనగా దేవునకు స్నానము చేయించుట, భగవంతుని పాదములొత్తుట మున్నగు సకలోపచారములు చేయుట యను భావముతో భగవంతుని అర్చించు విధానము. దాస్యభావభక్తి గలవారిలో శ్రీ ఆంజనేయస్వామి ఆదర్శప్రాయుడుగా తీసికొనబడుచున్నాడు.

అటుగాక భగవంతునితో సన్నిహిత సంబంధమును గల్పించుకొని ఆతని తన మిత్రునివలె ఎంచి మెలగుచు సలుపు భక్తి సఖ్యభక్తి అనబడును. ఇదియే కుచేలుని భక్తి. అర్జునుడు కూడ యీ కోవకు చెందినవాడే.

నాల్గవది వాత్సల్యభక్తి. ఈ భక్తి విధానమున పై మూడు విధములలోకంటె భక్తుడు భగవంతునితో మరింత సాన్నిహిత్యమును కల్పించుకొనుటకై ఆ భగవంతుని తన బిడ్డగా భావించి తలిదండ్రులు తమ కుమారునిపట్ల చూపు ఆత్మీయతను ప్రేమను వాత్సల్యమును ప్రకటించుచు ఆ దేవునికి ఉపచారములు చేయుచు భక్తి సలుపును. బాలకృష్ణుని పెంచిన

యశోద యిట్టి భక్తికి చెందినది. వాత్సల్య భావమునకు బాల కృష్ణుని, బలరాముని ప్రధానముగ గైకొందురు. హిందీసాహిత్యమున మహాప్రసిద్ధుడైన సూరదాసు ఇట్టి వాత్సల్యభక్తిని మిక్కుటముగ సాధించి ధన్యుడైనాడు.

ఇక ఐదవది భక్తిమార్గము లన్నింటిలో అత్యంత ముఖ్యమైనది. దీనిని దాటుటతోడనే అద్వైతమార్గమునకు త్రోవ కనిపించును. ఇదియే మధురభక్తి అనబడును. ప్రపంచమున ఎన్ని యిక్కట్టులు వచ్చినను తెగిపోని మధురబంధముతో పెనవేసికొనియుండు భార్యాభర్తల నడుమ విలసిల్లు ప్రేమయే యీ మధుర భక్తిభావము. ఇంతకుమించిన సన్నిహితత్వము మరియొకటి లేదు. ఇంతకుమించిన సుఖదాయకము ఆనంద దాయకమునైన బంధము మరియొకటి లేదు. ఈ మధురభావము ఎంతటి త్యాగమునకైనను సిద్ధమగును. రాధాకృష్ణుల దివ్యప్రేమయు, గోపికల ప్రేమభావమును, భక్త మీరాబాయి సాధించినదియును ఈ మధురభక్తియే-ఇట్టి ఐదువిధములైన భక్తిమార్గములను 'మర్కటకిశోరన్యాయము' అని శాస్త్రజ్ఞులు పేర్కొనుచున్నారు.

ఈపై ఐదు మార్గములలో భక్తునకు స్వాతంత్ర్యము అధికము. కాని భగవంతునిపై ఆధారపడియుండుట అరుదు. భగవంతుని భక్తితో తనంత తాను స్వాధీనపరచుకొనుటయే యిందలి ప్రత్యేకత. అట్లుగాక కేవలము భగవంతునిపై ఆధార

పడి యుండుటను 'మార్జాల కిశోర న్యాయము' అని పెద్దలు చెప్పుచున్నారు. శ్రీరామకృష్ణ పరమహంస ఈ మార్గముననే ప్రయాణించినాడు. ఇందేలోభమును కానరాదు. మార్జాలము తన పిల్లలను కాపాడినట్లు తనభక్తుల నాదేవుడే కాపాడును. భగవంతుడు సృష్టి, స్థితి, లయ కారకుడు. పురుషవాచ్యుడుగ పైన చెప్పబడిన భగవానుడు స్త్రీ వాచకుడునై 'భగవతి' యన బరగుచున్నాడు. అనగా శక్తి సహాయము లేనిదే ఆతడేమియు సృజింపలేడు. అట్టి శక్తిని నిష్కల్మషముగా ఆరాధించుటయే యుండలి భావము. ఈ యూరు మార్గములలో భగవంతుని పూజించుచు, ప్రేమించుచు, ఆతనికై సర్వమును త్యాగమొనర్చుచు అతని అనుగ్రహమును, దర్శన, స్పర్శన, భాషణ భాగ్యములను పొంద యత్నించుటయే పరమార్థము.

38. దేహ పతనానంతరము భక్తుడు పొందు అవస్థ యేది ?

భక్తి యోగమందున్న భక్తుడు శరీర త్యాగానంతరము మోక్షమందును. ఇట్టిమోక్షము నాల్గువిధములుగ విభజింపబడినది. 1. సాలోక్యము 2. సామీప్యము 3. సారూప్యము 4. సాయుజ్యము. ఇందు ఒకదానికన్నను మఱియొకటి శ్రేష్ఠమైనది.

సాలోక్య మోక్షము ప్రకారము భక్తుడు భగవంతుని లోకమున వసించుట యను సిద్ధి కలుగును. అట్లుగాక భగవంతుని గృహముననో లేక ఆతని యూరనో దగ్గరగా వసిం

చుట సామీప్యము, ఇంకను నధికుడగు భక్తునకు భగవంతుని రూపము కలుగును. అనగా నాల్గుచేతులు మున్నగు వివిధ రూపములు లభించును. ఇదియే సారూప్యము అనబడును. పై మూడు విధముల కన్నను అధికమగు భక్తుడు సాయుజ్యము నందును. అనగా భగవంతుని శక్తులలో కొన్నింటిని పొందును. భక్తిమార్గము ననుసరించిన భక్తుడు భగవంతుడుగ నగుటకు వీలులేదు. భక్తుడు . జీవుడు వేర్వేరు వారు అనుటనే 'ద్వైత భావము' అందురు. ఇట్లుగాక "అహంబ్రహ్మాఽస్మి" నేనే బ్రహ్మమును అను స్థితికి ఏముముక్షువు చేరునో అట్టివానిని జ్ఞాని అందురు. ఆతడవలంబించు మార్గమే జ్ఞానమార్గము.

39. జ్ఞానయోగము అనగానేమి ? అది పొందుట అందరకు సాధ్యమా ?

అజ్ఞానమునుండి తొలగుటయే జ్ఞానము. అజ్ఞానమును 'చీకటి' – అను పదముద్వారా నిర్వచింపవచ్చును. మఱి చీకటి అనగానేది ? బాహ్యముగా కంటికి కనిపించునదికాదు. అది మానసిక సంబంధమైనది. అనగా జీవాత్మ పరమాత్మల కభేద తత్త్వము గోచరించుట. జీవుడు తాను పరమాత్మ స్వరూపమగు బ్రహ్మమయ్యు తాను బ్రహ్మము కాడనియు, భగవంతుడనువాడు వేఱొకడు కలడనియు – తాను సంసార సుఖదుఃఖ యుక్తుడగు మూఢుడనియును భ్రాంతి చెందును. ఇదియే మాయ. ఈ భ్రాంతినే అద్వైతులు రజ్జు సర్పభ్రాంతి

యనుచున్నారు. అట్లుగాక ఆ భ్రాంతి (చీకటి; అజ్ఞానము) నుండి వెలువడి తానే బ్రహ్మమని గ్రహించి (జ్ఞానము) అనిర్వచనీయానందము నందుటయే జ్ఞానయోగము అని అద్వైత జ్ఞానులు పలుకుచున్నారు.

వేదాంతతత్వవిదుడగు గురువు జీవునకు "తత్వమసి"- అని బోధించును. తత్ త్వం అసి - ఆ బ్రహ్మము నీవు అగుచున్నావు అని ఆ మహావాక్యమున కర్థము. ఆ వాక్యమును జీవుడు వినును. దీనినే శ్రవణము అందురు. ఆ వాక్యమును వినినపిమ్మట దానిని "మననము" చేయును. అట్టి మనన పూర్వకమగు వాక్యము "అయమాత్మా బ్రహ్మ" ఈ ఆత్మ బ్రహ్మముగా నున్నది - కావున నేనే బ్రహ్మమును అని తీర్మానించుకొని "అహం బ్రహ్మాస్మి" - అనును. తరువాత ఆనందములో స్థిరమైన సందేహరహితమైన స్థితిలో నుండును. దీనిని నిధిధ్యాసనము అందురు. అద్వితీయానందమున మునిగి బాహ్యప్రజ్ఞ లేకుండ నుండును. ఈ స్థితిని సూచించుటకు "ప్రజ్ఞానం బ్రహ్మ" - అను నాల్గవవాక్యము సూచింపబడినది. ఈ నాల్గు వాక్యములను మహావాక్య చతుష్టయము అందురు. ఇవి శిష్యుని గురువునంతటి వానిగా చేయును.

ఈ చెప్పిన శ్రవణ మనన నిదిధ్యాసనముల నాచరించి, అనుభవించి "అహం బ్రహ్మాస్మి" - అనువానిని జ్ఞాని, బ్రహ్మవిదుడు, జీవన్ముక్తుడు అను నామములతో వ్యవహరింతురు.

అనగా అజ్ఞానము నశించి జ్ఞానము వెల్గినది. అట్టి జ్ఞాని మరల జననమరణ ప్రవాహ రూపమగు సంసారమునకు రాడు. ఆతడు జన్మరాహిత్యమునందును. అట్లయిన ఈ జ్ఞానమార్గము ఎందఱకు సాధ్యమగును - అందరును గ్రహింపగలరా! యనునది యొకప్రశ్న. దానిని పరిశీలింతము.

జ్ఞానయోగము అందరకు అసాధ్యము, కష్టతమము. అది బ్రహ్మవిద్యతో కూడియున్నది. ఈ మార్గమున కింత కష్టము వచ్చుటకు కారణమును చూతము. న్యాయదర్శనము-వైశేషికము - సాంఖ్యము - యోగము - పూర్వ, ఉత్తర మీమాంసలు అనబడు షట్ దర్శనములును, వేదభాగము లగు ఉపనిషత్తులును, బ్రహ్మసూత్రములును వానికి సంబంధించిన భాష్యములును, ఇతర పండిత గ్రంథములును సంస్కృత భాషలో రచింపబడియున్నవి. సామాన్యప్రజల కర్థమగు రీతి వీనియందు గోచరింపదు. పై గ్రంథములు చదువనిదే జ్ఞాన యోగము గమ్యముకాదు. అంతియేకాక జ్ఞానమార్గము త్యాగ ప్రధానమైనది. సంసారబంధమును ఛేదించి - మోక్షము నాశించి సన్యాసులైనవారలే ఆ సంవిధానమును గ్రహింపగలరు. ఎందఱు ఇట్టి త్యాగమున కనుకూలముగ నుందురో! ఈ మార్గమునకు సంబంధించిన యమ నియమాదులను గ్రహించినవారు సహితము త్యాగహీనులగు ప్రజలకు బోధింపరు. త్యాగహీనమును అనుభవరాహిత్యమునునైన విద్యకు పరిపూర్ణ

త్వము లేదనునది వారి సిద్ధాంతము. అందుచే జ్ఞానమార్గము సాంసారికజీవనము గడపు సామాన్యులకు అగమ్యము - అగ్రాహ్యామునని చెప్పక తప్పదు.

దీనికి తోడు ఈ విద్యయందు అభివృద్ధి పొందవలెనని ఆశించినవారికి శ్రీ శంకరాచార్యులు "అబ్బాయీ ! నాలుగు విషయములను ముందుగ నేర్చుకొనుము" - అనినారట - ఈ నాల్గువిషయములనే సాధన చతుష్టయము అందురు.

40. సాధన చతుష్టయమనగా నేమి ?

1. వీనిలో మొదటిది నిత్యానిత్య వివేకము.నిత్యపదార్థ మేదియో, అనిత్య పదార్థమేదియో గ్రహించుట. అనిత్య మును ముందుగ పరిశీలించిన పిదప నిత్యము గోచరించును. అనిత్యము - నిత్యముకానిది. అనగా శాశ్వతత్వము లేనిది. అట్టిదేది ? కంటికి కనిపించు ప్రతి వస్తువును అనిత్యమే. అందులకే శాస్త్రకారులు "యద్దృశ్యం తన్నశ్యతి" అని యుద్ఘాటించినారు. ప్రపంచమున దృశ్యములగు జీవరాసులలోను - వస్తువులలోను శాశ్వతముగ నిలచునదేదియు లేదు. అందులకే గౌతముడు బాహ్యామున ముదుసలిని చూచి తన భార్యయు నట్లగుననియు, ఆమె సౌందర్యము నశ్వరమనియు భావించి నిత్యపదార్థ సంపాదనకై కృషియొనర్చి సఫలీకృతుడై నాడు. నిన్నటి దినమున మిక్కిలి ప్రేమతో ధనము ధారవోసి కొనిన పుష్పములు మరునాటికి వీథులపాలు కావలసినవే కదా !

మఱి ఇహలోక సంబంధములుగాక పరలోక సుఖములు నిత్యములని భావింతురేమో ! పుణ్యవిశేష ముండునంతకాలమే అదియును నిలచునది. పిదప నరకమునకు హేతువేకదా - కాన ప్రపంచమున నయన గోచర పదార్థజాల మనిత్యము. ఇక నిత్యమేది ? నిత్యమొక్కడే. అదియే బ్రహ్మము - అనగా భగవద్విషయము. ఇట్టి వివేకమును కలిగియుండుటే నిత్యానిత్య వస్తు వివేకమనబడును. ఇది జ్ఞానమార్గమున ప్రథమ సోపానము

2. ఇంతటి వివేకము కలిగినపిదప మానవుడు త్యాగానికి సన్నద్ధుడగును. ఇహలోక సుఖములు - పరలోక భోగములనిత్యములని గ్రహించి వానియందలి కాంక్షను విరమించుకొని నిత్యత్వమునకు మార్గములను వెదకుటకు పట్టుదల కల్గియుండును. పరలోక సుఖములనే అముత్రములందురు. అందువలననే సాధన చతుష్టయములో రెండవది "ఇహాముత్ర ఫలభోగ విరామము" అనబడుచున్నది. దీనినే ఒక్కమాటలో వైరాగ్యమన వచ్చును, వివేక వైరాగ్యముల కవినాభావ సంబంధముకలదు. వివేకము సక్రమమైనచో వైరాగ్యము దానిననుసరించును. వివేకములేని వైరాగ్యమును, వైరాగ్యములేని వివేకమును నిష్ప్రయోజనములు. శాస్త్రమున చెప్పబడిన ప్రకారము శాస్త్రాభ్యాసము - స్నానసంధ్యాదికము - గురుభక్తి-బ్రహ్మచర్యము సత్సాంగత్యము - అహంకార త్యాగము - గృహస్థాశ్రమము

వానప్రస్థాశ్రమములందు క్రమ పరిణతిపొంది - దారేషణ - పుత్రేషణ - ధనేషణములను ఈ షణత్రయములను వర్జించి సన్యాసమును పొందుటయే వైరాగ్యము. ఇది సాధన చతుష్టయమున ద్వితీయ సోపానము.

3. ఇక మూడవయది "శమాదిషట్కము" ఇవి యారు. శమము - దమము - ఉపరతి - తితిక్ష - శ్రద్ధ - సమాధానము అనునవి. వీనిలో మొదటిది "శమము" అనగా అంతరింద్రియ నిగ్రహము - ఇంద్రియములు పదునొకండు. జ్ఞానేంద్రియము లైదు, కర్మేంద్రియము లైదు - పైనొకటి మనస్సు. ఇందు జ్ఞాన, కర్మేంద్రియములు బాహ్యములు - మనస్సు అంతరింద్రియము. కాన మనస్సును నిరోధించుటయే శమము. చిత్తశాంతిని నశింపజేయు కామాదిషట్కమును కామ - క్రోధ - లోభ - మోహ - మద - మాత్సర్యములను దూరముచేసి - చిత్తమాన రూపమున శాంతిని పొంది ప్రాపంచిక విషయములను వీడియుంటయే శమము.

"దమ"మన బాహ్యేంద్రియ నిగ్రహము. అనగా పై చెప్పిన జ్ఞాన కర్మేంద్రియములను నిరోధించుట. ఇంద్రియములలో నొక్కొక్కదాని కొక్కొక్క ప్రవృత్తి యుండును. వానిని అనవసర కార్యములకై వినియోగింపక భగవచ్చింతనయందే నియమించి అదుపులోనికి తెచ్చుటయే దమము. ఆధ్యాత్మికాభివృద్ధి కుపయోగింపని యింద్రియములకు సార్థకత లేదు.

"ఉపరతి" యనగా పైన ఆనందము ననుభవించుట. కాని పై ఆనందము, క్రింది ఆనందము అను రెండు పద్ధతులు కాదు. అవి బాహ్యాంతర రతులు. బాహ్యేంద్రియములగు కర్మ జ్ఞానేంద్రియములతో మనకన్నను బాహ్యముగనున్న ప్రపంచమును చూచి ఆనందించుట బాహ్యారతి. చూచిన విష యమును స్మృతికి తెచ్చుకొని ఆనందించుట అంతరరతి. ఈ రెండును దైవసంబంధ మగునట్లు చూచుకొనుట కర్తవ్యము. అనగా బాహ్యప్రపంచమును మరచి అంతరంగమున ఆధ్యాత్మిక చింతనతో ఆనంద మనుభవించుటయే ఉపరతి. ఈ చెప్పిన మూటియందును శ్రేష్ఠము ఉపరతి. శమదమాదులు ఉపరతికి పునాదులు.

శమదమాదులు సులభములు కావు. వీనికి అంగములు "తితిక్ష" - "శ్రద్ధ" - "సమాధానము" లనునవి. వానిని పరీ క్షింతము. "తితిక్ష" యను మాటను సహనము, ఓర్పు, క్షమ అను పదములతో అర్థమును చెప్పవచ్చును. అనగా విరుద్ధభావ నలు కలిగినను సహించి సాధనయందు మునిగియుండుట. భగ వంతుడు భక్తుని పరీక్షించుటకై, క్షమను కలుగ జేయుటకై అనేక ఆటంకములను కలిగించును. అట్టి సమయమున కోప తాపములను పొందరాదు. త్రిగుణములలో నొకటియగు సత్వ మును తితిక్ష ఆశ్రయించి యుండును. బాహ్యప్రపంచమునుండి వచ్చు సమస్త ఆటంకములను లక్ష్యముసేయక ఉదాసీన భావ ముతో వికారములేక స్థిరముగా నుండుటయే తితిక్ష.

అట్టి తితిక్షను సాధించుటకు ముఖ్యమైనది "శ్రద్ధ" శ్రీకృష్ణుడు గీతలో "శ్రద్ధావాన్ లభతేజ్ఞానమ్" అని పల్కినారు. శ్రద్ధ లేనివారికి భక్తియు, భక్తిలేనివారికి జ్ఞానమును శూన్యములు. అందుచే ఆధ్యాత్మిక సాధమునకు శ్రద్ధయే పునాది. ఇది నాలుగు విధములు. ఆత్మ - మార్గ - గురు - భగవద్విశ్వాసములు. ఆత్మవిశ్వాసమనగా సాధకుడు తన శక్తిసామర్థ్యములతో ఆధ్యాత్మిక గమ్యమును చేరగలనను ధైర్యమును పొందుట. మార్గ విశ్వాసమనగా తాను చేరవలసిన గమ్యమునకు తగు మార్గము నెన్నుకొని అందే ప్రయాణించుట. పిదప సరియైన గురువును వెదకికొని పరీక్షించి వారి అడుగు జాడలనే అనుసరించుట గురు విశ్వాసము. పై విశ్వాసములకు మూలకారణమగు భగవంతుని పొందుటకై త్యాగమొనర్చుట కడపటిదగు భగవద్విశ్వాసము. ఇట్లన్నిరకముల విశ్వాసము కల్గియుండుటనే శ్రద్ధయని యందురు.

శమాదులలో కడపటిది "సమాధానము." సమాధానమనగా నిర్వికారత లేక నిశ్చలత. అన్ని విధముల సాధన జేసి పై లక్షణములను పొందినను మఱికొన్ని బలహీనతలు మార్గమున కంటకములుగ నిలచియుండును. వానిని తొలగింపవలయును. పూర్వ జన్మార్జితములైన కుసంస్కారములు విడిపోయి మనస్సునకు బాధను కల్గింపకున్నచో నీ సమాధిస్థితి లభించినట్లగును. ఆ ఆటంకములు తొలగిపోకున్నచో నీ మార్గము సుకరము కాదు. సాధకులు అనేకు లిచటనే మోసపోవుదురు.

సాధన చతుష్టయములో సంపత్తిలో నాల్గవయది "ముముక్షుత్వము". దీనిని సమస్త ఆధ్యాత్మిక శాస్త్రసారమన వచ్చును. సాధన చతుష్టయము నందలి వివేక వైరాగ్య శమాదులు ముముక్షుత్వము లేని యెడల నిష్ప్రయోజనములగును. సాధనయొక్క అభివృద్ధి మూడు ముఖ్యలక్షణముల ద్వార ప్రకటితమగుచుండును. వానియందు మొదటిది ధార్మిక జీవితము. ధార్మిక జీవితమనగా మానవునకు ప్రపంచముతో నుండు సంబంధములు నిర్మలముగ నుండుననుట దీనిని నైతిక జీవితమనికూడ అందురు. ఇట్టి నైతికబలము లేని వానికి ఆధ్యాత్మికబలము సంప్రాప్తించదనియే చెప్పవచ్చును. ఎవని యందు యమములు సంపూర్ణముగనుండునో వాని జీవితమే నైతిక జీవితము కాగలదు. యమమునందు ఆవంతయైనను ప్రవేశింపక కేవలము కాషాయములు మాత్రము ధరించి వేషములు వేయు సన్న్యాసులు గురువులు మున్నగువారు గొప్ప మోసగాండ్రు మాత్రమే యగుదురు. అందుచే ఆధ్యాత్మిక జీవితమును నొందదలచిన వాడు మొట్టమొదట మంచి ప్రవర్తన గలవాడు కావలయును. సాధనయందలి రెండవ ముఖ్య విషయము వైరాగ్యము. మానవుడు ప్రపంచమున తన ప్రవర్తనను ప్రపంచముతో తన సంబంధమును పవిత్రము చేసికొను కొలది ప్రపంచము నందలి లోపములు దోషములు ఆతనికి స్పష్టముగ గోచరములగును. అందుచేత అతడు ప్రపంచ సంబంధములు తగ్గించుకొనుటకు ప్రయత్నించును. అటుపై

ఈ ఐహిక సంబంధములు ఆధ్యాత్మిక జీవితమునకు ఆటంకము లని అతడు తెలుసుకొనును. అట్లు మానవుడు బంధుమిత్ర కళత్రాది బంధములు గలిగి పలువిధముల అనుభవములను పొందిన పిదప నైతిక జీవితమును అటుపిమ్మట ఆధ్యాత్మిక జీవితమును అందగలుగుచున్నాడు.

పై చెప్పిన విధమునగాక గతజన్మల సంస్కారముల బలము చేతను సద్గురువుల బోధచేతను యితరుల జీవితములలోని అనుభవములను గమనించుటచేతను ఐహిక సంబంధములయందు ఆశక్తిని నశింప జేసికొనుచు వైరాగ్యము పొందువారు కొందరుందురు. ఈ వైరాగ్యము మానసికముగను లౌకికముగను రెండు విధములుగను నుండవలయును. అపుడే మానవుడు ఆధ్యాత్మిక జీవితమునందు అభివృద్ధిని సాధించగలడు. ఇక సాధనయందలి మూడవ విషయము దైవభక్తి. జగత్తునకు మూలము భగవంతుడని నమ్మి ఆతని దర్శన స్పర్శనాదులు పొందవలయునని యత్నించుటయే దైవభక్తికి అర్థము. దీనినే మరియొకమాటలో ముముక్షుత్వమని యందుము. మోక్షమును కాంక్షించువాడు ముముక్షువు అనబడును. మోక్షము అనగా ముక్తి లేక బంధమునుండి విడివడుట అని యర్థము. బంధమనగా సంసారము. సంసార సుఖములు క్షణికములని, వీనియందు కల్గు కష్టనష్టములలో తాదాత్మ్యము చెంది బాధపడుట యుక్తము కాదనియును, జననమరణ పరం

పరనుండి వెలువడవలెననియు శాశ్వతానందమును పొందవలె ననియు భావించి, అందులకై ప్రయత్నించుటను ముముక్షుత్వ మని యందురు. ఆధ్యాత్మికాభివృద్ధి సమగ్రముగ నుండవలె ననిన ముముక్షుత్వము సంపూర్ణముగ నుండవలెను. ప్రవర్తన, విరాగ, ముముక్షుత్వము లొకదానిపై నొకటి యాధారపడి యున్నవి.

ముముక్షుత్వము తీవ్రము - మధ్యమము - మందము అతిమందము - అని చతుర్విధములుగ నున్నది. రామకృష్ణుడు వీనిని ఒక ఉపమానంతో చక్కగా వివరించి యున్నాడు.

ఎద్దులవారు ఎద్దుల పరీక్షకై పోవుదురు. అందు శయనించిన ఒక యెద్దువద్దకు పోయి దానిని పరీక్షించుటకై అది నిలచిన దనుక బాధింతురు. పిమ్మట వేఱొక దానిని చూతురు. అది పెద్దబాధలకు గురికాకుండ నిలచియుండును. బేరగాండ్రు మఱియొకదానిని చూచును. అది దెబ్బలకు గురికాక వారు సమీపింపగనే నిలబడును. ఇంకొకటి వీరిని చూడగనే నిలబడును. ఇందు నాల్గవది తీవ్రజాతికి చేరినది. ఇట్లే మిగిలినవి మధ్యమ - మంద - అతిమంద జాతులకు చేరినవై యున్నవి. అదే విధముగ సాధకులలో నిట్లే యుందురు.

మానవుడు నానావిధ తాపత్రయ విచార మగ్నుడై సంసార సుఖహీనుడై, సర్వమనర్థమని భావించి, వేఱొకరిచే చెప్పించుకొనక తనకు తానె సర్వసంగ పరిత్యాగియై విరాగి

యగును. వైరాగ్యమును పొందును. ఇది తీవ్రము. మఱి కొందరు బాహ్య సుఖమనిత్యమని గ్రహించియు పుత్రకళత్ర బంధుజనముల విడువ మనసురాక రెంటికిని మధ్య కొట్టు మిట్టాడుచుందురు. ఇది మధ్యమము. మోక్షమును పొందుటకు త్వరపడనేల ? నాకింకను కాలము చాలగలదు. సర్వ సుఖం అష్టైశ్వర్య భోగానంతరమే అందులకై ప్రయత్నింతును" అను భావమును పొందుట మందము. సకల ఐశ్వర్యములు తలపకయే లభించునట్లు మోక్షమును తలపకయే లభించినచో కృతార్థుడనగుదునని భావించుట అతిమందము.

ఇట్టి నాల్గువిధములలో తీవ్రమున యీ జన్మలోను, మధ్యమమున మరుజన్మమందును, మందమున యుగాంతరము నను మోక్షమందగలరు. కాని అతిమందమున కోటి కల్పముల నైనను మోక్షము నందలేడు. కాన ప్రతిమానవుడు పై విధానములలో ప్రథమమునకే ప్రాధాన్యమిచ్చి సద్గురువునుండి గ్రహించి జన్మ సార్థకము చేసికొనుట శ్రేష్ఠము.

41. సద్గురువు అనగా నెవరు ? లక్షణములేవి ?

"గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీగురవేనమః"

గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే ఈశ్వరుడు, గురువే నాతొత్తు పరబ్రహ్మము. అట్టి గురువు ఎట్లుండవలయు ననిన వేదార్థ పరిజ్ఞానము, బ్రహ్మనిష్ఠ, శాంతి, సమానదృష్టి

"బంధముక్తం బ్రహ్మనిష్ఠంకృత కృత్యంభజేద్గురుం। యస్య ప్రసాదాత్ సంసారసాగరో గోష్పదాయత్" ॥ అనగా బంధమునుండి విడివడిన వాడును, బ్రహ్మనిష్ఠుడును, సమాధి నిష్ఠుడును, కృతకృత్యుడునైన గురువును మనము సేవించ వలయును. ఇట్టి గురువును శిష్యుడు ఏవిధమున భావింప వలయుననిన "యథా దేవో తథా గురో" గురుడే దైవమనియు, దైవమేగురుడనియు భావించవలయునేగాని యిరువురిలో స్వల్పమైన భేదభావమున కనిపించరాదు.

ఇట్టి సద్గుణములుగల గురువులు మానవకోటిలో అరుదుగ నుందురు. వారిలో సిద్దయ్య అదృష్టమున సద్గురువు సాక్షాత్తు పరబ్రహ్మమైన బ్రహ్మముగారు గురువుగా లభించుట వారి పూర్వజన్మ సుకృతంబే గదా। యిప్పటికిని బ్రహ్మముగారు ఉపదేశించిన "కాలజ్ఞానము" జరుగుచున్నట్లుగా తెలియుచున్నదిగదా! అదే విధముగ వివేకానందుని అదృష్టమున సాక్షాత్తు దైవ స్వరూపులైన శ్రీరామకృష్ణ పరమహంస లభించుట వారి అదృష్టమేగదా! ఈ విధముగనే అర్జునుని అదృష్టమున జగద్గురువు, పరిపూర్ణావతారులైన శ్రీకృష్ణ పరమాత్మ గురువుగా లభించెను. సిద్దయ్యకు, వివేకానందునకు, అర్జునునకు శిష్యులకు వుండదగిన లక్షణము లన్నియు కనబడెను. అర్జునుడు యీలోక సుఖములను పర లోక సుఖములను కోరలేదు. "నేను నీకు శిష్యుడను. దుఃఖ

నన్ను శిక్షింపుము. అని కోరియున్నట్లుగా రామగీత చెప్పు చున్నది. అవధూత గీతలో ఏవిధముగ చెప్పిరనిన

"బాలస్య వాభిఖిర భోగరతస్య వాపిమూర్ఖస్య సేవకజనస్య గృహస్థితస్య,

యేతద్గురోః కిమపినైవ విచింతనీయం రత్నం పరిత్య జతికోస్య కుచౌప్రతిష్ఠం"

అనగా లోకంబున ఎవ్వండు ఏ ప్రకార మమేధ్యంబున నుండునట్టి మేలయిన పదార్థములయినను గ్రహింపక వదలు చున్నాడో అట్లే గురువు వేదాంతశాస్త్రసంపత్తి గలవాడయ్యు అతండు బాల్యము, సమస్త భోగాసక్తి, మూర్ఖత్వము, సేవ కత్వము, గృహాసక్తి కలిగి యుండెనేని అతనియొద్ద ఉపదేశము చేసికొనరాదు. కావున గురువు విషయమే విచారించదగినది.

ఇట్టి విషయమునే కొత్తనిబంధన బైబిలులో సహితము మత్తయి 10-7,8,9,10 వాక్యములవలన గ్రహించినదేమన గురువునకు ధన సంబంధముగాని, స్త్రీసంబంధముగాని యుండ కూడదనియు, గురువు గొప్పస్వార్థత్యాగియై యుండవలయు ననియు తెలియజేయుచున్నది. ఇట్టి విషయమునే భాగవత ములో సప్తమస్కంధములో ప్రహ్లాదుడు యిట్లు పల్కెను. "కానని వానినూతగొని కానని వాడు విశిష్ట వస్తువుల్ గానని

భంగి" అనగా గ్రుడ్డివారికి గ్రుడ్డివాఁడు దారి చూపించుచో యిరువురును గోతిలో బడుదురు. అని పల్కియున్నారు.

సద్గురువుద్వారా భగవంతుని విషయములు తెలియబడునని ఊహించవలయును. గురువులకును భగవంతునకును భేదము లేదని ఊహించువాడు యీసంసార సాగరమునుండి బయటపడి తనస్వస్థానమైన పరమాత్మ స్థానమును పొందును. ఇయ్యదియే సద్గురువు లక్షణములు.

42. ఇట్టిసద్గురువు శిష్యుని తరింపజేయుటకు ఉపదేశించు మంత్రరాజము లేవి ?

సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపులైన గురుదేవులు శిష్యుని అన్నివిధముల పరీక్షించి; తగినవాడనిఎంచి మంత్రోపదేశము చేయును. అట్టి మంత్రములలో ముఖ్యమైనవి. 1) గాయత్రీ మహామంత్రము. 2) అష్టాక్షరీ మహామంత్రము. 3) పంచాక్షరి మహామన్ంత్రము. 4) తారకనామ మంత్రము.

గాయత్రీ మహామంత్రము

ఈ గాయత్రి మహామంత్రము సర్వోత్కృష్టమైనది. సర్వార్థ ధాయకమైనది. పవిత్రముగ మనస్సునందు జపించుకొన వలసియున్నది.

మంత్రము :- "ఓం భూర్భువః సువః ఓం తత్ సవితుర్వ రేణ్యం । భర్గో దేవస్యధీ మహిధియో యోనః ప్రచోదయాత్"

అనగా 'ఓం' బ్రహ్మను తెలియజేయు పదార్థము. 'భూః' భూలోకము, 'భువః' అంతరిక్షలోకము 'స్వః' ద్యులోకము 'యః' ఎవ్వాడు 'నః' మనయొక్క 'ధియః' బుద్ధి వృత్తులను (అనగా జ్ఞానేంద్రియ కర్మేంద్రియములను) 'ప్రచోదయాత్' ప్రేరేపించుచున్నాడో 'తత్సవితుః' ఆజగత్ కారణునియొక్క 'వరేణ్యం' ఉపాధింపదగిన 'భర్గః' తేజస్సును (పరమాత్మ స్వరూపమును తేజోజ్ఞాన శక్తులను) 'ధీమహి' ధ్యానించు చున్నారము.

భావము :- ఎవనినుండి యీ జీవులన్నియు జన్మించుచున్నవో, ఎవని వలన జీవించుచున్నవో, అంతిమకాలములో ఎవనివద్దకు తిరిగి పోవుచున్నవో ఆయనయే పరబ్రహ్మ. ఆయనను తెలుసుకొనుము. 'ఓమ్' అనునది సృష్టి స్థితి లయకర్తయైన పరబ్రహ్మను గురించి తెలియపరచుచున్నది. కావున ప్రతిమానవుడు ఈ గాయత్రీ మహామంత్ర జపవిధానమును సద్గురువునుండి తెలుసుకొని పఠింపవలయును. స్మరింపవలయును. జన్మరాహిత్యమును ప్రబోధించు మంత్రమిదియే.

అష్టాక్షరి మహామంత్రము

శ్రుతి : ఓమిత్యగ్రేవ్యా హరేత్, నమ ఇతిపశ్చాత్,
నారాయణా యేత్యుపరిష్టాత్, ఓ మిత్యేకాక్షరం
నమఇతిద్వే అక్షరే, నారాయణా యేతి
పంచాక్షరీ, ఏతద్వైనారాయణ
స్యాష్టాక్షరం పదం యోహావై నారాయణ స్యాష్టాక్షరం
పదమధ్యేతి అనుబ్రువన్ సర్వమాయురేతి విదం
తే ప్రాజపత్యం రాయఃపోషం గౌపత్యం తతో
మృతత్వ మశ్నుతే ఇతి ఏతత్సామ వేదశిరోధితే॥

భావము : 'ఓం'కారమగు ప్రణవ స్వరూపమును, 'నమో' యనెడు రెండు అక్షరములును 'నారాయణాయ' అను ఐదు అక్షరములును కలసి అష్టాక్షరి యగుచున్నది. ఎవరైతే యీ మహామంత్రమును సద్గురువునుండి గ్రహించి నిరంతరము జపించుదురో అట్టివారు పూర్ణాయుఫ్ఫును పొంది ప్రజాపతిత్వమును పొందుచున్నారు. గోవులు భూమి మున్నగు సర్వ సంపదలు కలవారగుచున్నారు. జన్మములేని బ్రహ్మైక్యము విదేహ కైవల్యముక్తి (జన్మరాహిత్యమును) పొందుచున్నారని సామవేదమునందలి ఉపనిషత్తులలో చెప్పబడియున్నది.

పంచాక్షరీ మహామంత్రము

శ్రుతి "వేదాంత సారం ప్రథమస్వరాణాం, త్రయతత్వసారం ప్రణవంనమామి.".

ప్రణవస్వరూపమైన 'ఓం' కారము నందే వేదములు పుట్టినవి.

"ఓం నమశ్శివాయ' అను పంచాక్షరి అంతర్భావము. 'న' నేను, 'మ' మాయాతీతమైన; 'శి' శిద్ధమైన ; 'వ' వైరాగ్యముచేత; 'య' యావత్తు 'ఓం' నేనైతిని.

నేను మాయాతీతమైన సిద్ధమైన వైరాగ్యము చేత నేనైతిని. అనగా యీ శరీరము నేను గాక ప్రణవస్వరూపము నేనైతిని యిక నాకు జన్మరాహిత్యము గలిగినదనెడు యీమహా మంత్రమును సద్గురువునుండి తెలుసుకొని నిరంతరము జపించ వలయునని సామవేదమునందలి ఉపనిషత్తులలో చెప్పబడి యున్నది.

తారకనామ మంత్రము

కలియుగములో భగవన్నామముచే తరింపవచ్చును. కృతయుగములో ధ్యానము చేసిన ఏ ఫలితము గలుగునో అట్టి ఫలము త్రేతాయుగములో యజ్ఞము చేయుటవలన గలుగును. అట్టి ఫలమే ద్వాపరయుగములో అర్చన చేయుటవలన కలుగును. కాని కలియుగములో అట్టి ఫలము కేవలము భగవ

గురుపూజా విధానము

ఈగురు పూజయే జన్మరాహిత్య (మోక్ష) పదవికి మూలము.

ఓం

తత్ సత్ శ్రీ పందిరి ముసలయ్యా దేశికస్వామి గురుపరబ్రహ్మ ణేనమః

— : ఘంటానాదం : —

ఓం ఆగమార్థంతు దేవానాం గమనార్థంతు రాక్షసాం
కురు ఘంటారవం తత్ర దేవ తాఽఽహ్వాన లాంఛనం.॥

[తదుపరి కేశవ నామములతో సంకల్పము చెప్పుకొని, పూర్వోక్త ఏవంగుణ విశేషణ విశిష్టాయాం, శుభతిథే, జన్మ రాహిత్య ప్రాప్త్యర్థం జీవన్ముక్తి విదేహ కైవల్య ప్రాప్త్యర్థం సద్గురు పూజా మహాంకరిష్యే. తదుపరి గురుధ్యానము చేయ వలయును.]

ధ్యానము .

ఓం గురుర్బ్రహ్మ గురుర్విష్ణు సద్గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్పరం బ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః॥

ఓం అఖండ మండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీ గురవేనమః॥

ఓం హరలీలావతారాయ శఙ్కరాయపరాజసే ।
కైవల్య కలనాకల్ప తరవే గురవే నమః॥

ఓం బ్రహ్మణేమూర్తి మతే శ్రుతానాం శుద్ధి హేతవే।
నారాయణ యతీన్ద్రాయ తస్మై శ్రీ గురవేనమః॥

ఓం శ్రీ సచ్చితాన్ద రూపాయ జ్ఞాన వైరాగ్య దాయినే।
అపజ్ఞానన్ద దేవాయ తస్మై శ్రీ గురవేనమః॥

సంకల్పము · "హరిః ఓం అశరీర గురుసామ్రాజ్య పూజా విధాన మహాంకరిష్యే" అనుచు రెండు పుష్ప ములుగురు దేవునిపై చల్లినమస్కారము చేయ వలయును.

అఖండ సద్గురు సామ్రాజ్య నివాసే ఆర్యదర్శనస్పర్శన కామ్యార్థ ఫలం జన్మజన్మార్జిత దోష నివారణార్థం సాలోక్య సారూప్య, సామీప్య సాయుజ్య సాక్షిత్వకాలే అచలగురుపాద సన్నిధౌ ఆనంద పురనివాసే ముక్తి కాంతా సంయోగ క్షేత్రే సహస్రార అమృతానందతీరే పరబ్రహ్మావతారే బ్రహ్మనాళ పూర్మధ్యే బ్రహ్మానంద నామ సంవత్సరే తుర్యాతీతే అవ్యక్త ఋతువే అజ్ఞాన సూన్యమాసే ఆత్మ పక్షేకళావాసరే శుభ నక్షత్రే శుభతిథౌ శ్రీ పందిరి ముసలయ్య దేశికస్వామి నామ ధేయస్య శ్రీ మదఖండ సచ్చిదానంద సద్గురుప్రసాద ప్రీత్యర్థం బ్రహ్మసృష్టి ఆరంభాది బాల్య యవ్వన కౌమార వార్ధిక్యకాలే అవిద్యాకాలకర్మ జన్మవాసనాదోష నివారణార్థం శ్రీ సద్గురు దేవతా ప్రీత్యర్థం శ్రీ సద్గురుదేవతా ముద్దిస్య శ్రీ సద్గురు దేవతా షోడశోపచార పూజాంచకరిష్యే॥

సమాధివైపు తిరిగి "హరిః ఓం అశరీర గురుసాంప్రదాయక సమాధి పూజావిధాన మహంకరిష్యే" అనిచెప్పి రెండు పుష్పములు సమాధివైపునచల్లి నమస్కారము చేయవలయును.

కలశపూజా విధానము

తదంగ కలశారాధన మహంకరిష్యే ।
కలశగంధాక్షత పత్రపుష్పైరభ్యర్చ్య ।

అని చెప్పుచు కలశములో నీరుపోసి గంధము, కుంకుమ, అక్షితలు, పుష్పములతో, కలశమును అలంకరించవలయును.

